ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 21 సెప్టెంబరు 2024



సంతమాగులూరు : మిన్నేకల్లులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

ప్రజల వద్దకు.. పాలకులు



భట్టిప్రోలు: వెల్లటూరులో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



పిట్టలవానిపాలెం: గోకరాజువారిపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాన్ని అంటిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

- కోలాహలంగా.. ఇది మంచి ప్రభుత్వం
- తొలి రోజు ప్రజల నుంచి అనూహ్య స్పందన
- పంచాయతీలు, వార్డుల్లో ఉత్సాహంగా కార్యక్రమాలు
- పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్ల ఏర్పాటుపై హర్షాతిరేకాలు
- నియోజకవర్గాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- సంక్షోభంలోనూ చంద్రబాబు వల్లే సంక్షేమం, అభివృద్ధి అన్న నేతలు

బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మంచి చేశాం.. ప్రజల నుంచి మెప్పు పొందాం.. ఆ మంచిని చెప్పుకుందాం.. ప్రజల సమస్యలు తెలుసుకుందాం.. అంటూ ప్రజల వద్దకు పాలకులు వచ్చారు. ఇది మంచి ప్రభుత్వం పేరుతో.. ప్రజల హర్షాతిరేకాల మధ్య ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం జిల్లా అంతటా కోలాహలంగా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 26వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలతో పాటు అధికారులు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొననున్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలు.. ప్రజాహిత.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నారు. తొలి రోజు శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. రోజుకో గ్రామం, మున్సిపాల్టీలో ఒక వార్డు సందర్శించాలని ప్రభుత్వం ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ ప్రకారం గ్రామం, వార్డుల్లో అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అమలు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేసి, మన మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రజావేదిక నిర్వహించిన ఎమ్మెల్యేలు ప్రజల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఉత్సాహ వాతావరణంలో కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పింఛన్ పెంపుదలపై అవ్వాతాతలు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. పట్టణాల్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో కడుపు నింపుకుంటున్న పేదలు సీఎం చంద్రబాబును ప్రశంసించారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ నిర్వహణపై యువత ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యేలు ప్రజలకు భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక సంక్షేమ పథకాలు అమలులోకి రానున్నాయని ప్రజలకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు గురించి వారం రోజులపాటు ఈ కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు, పార్టీల శ్రేణులు వివరించనున్నాయి.

- సంతమాగులూరు మండలం మిన్నేకల్లు గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు కలెక్టర్ వెంకటమురళి పాల్గొన్నారు. గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం వాటిని బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తోందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని కలెక్టర్ తెలిపారు. సంకల్పం, చిత్తశుద్ధితో అతి తక్కువ కాలంలోనే అనేక విజయాలు సాధిస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఇటీవల వచ్చిన వరదల్లో సమర్థంగా పనిచేసి ప్రభుత్వం ప్రజల మన్ననలందుకుందని తెలిపారు.
- మార్టూరు మండల పరిధిలోని జొన్నతాళి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి సీఎం చంద్రబాబు ఇది మంచి ప్రభుత్వం అని నిరూపించుకున్నారన్నారు.
- భట్టిప్రోలు మండలం వెల్లటూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని కూటమి ప్రభుత్వ వందరోజుల పాలన గురించి వివరించారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల నుంచి ప్రశంసలు అందుకుందన్నారు.
- పిట్టలవానిపాలెం మండలం గోకరాజువారిపాలెంలో జరిగిన కార్యక్ర మంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. అరాచక పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్యం వైపు కూటమి ప్రభుత్వం పరుగులు తీస్తుందన్నారు.
- చీరాల మున్సిపాలిటీ పరిధిలోని మరియంపేటలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొని వంద రోజుల పాలనలో జరిగిన మంచిని ప్రజలకు వివరించారు. స్వర్ణాంధ్ర 2024 దృష్టిలో ఉంచుకుని మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన చెప్పారు.
- రేపల్లె నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నేతలు ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు.



మార్టూరు: జొన్నతాళిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



చీరాల : మరియంపేటలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య





కూరగాయలు కొనలేం

అమాంతం పెరిగిపోయిన ధరలు

- దొండకాయలు, వంకాయలు కిలో రూ.60
- పెద్ద చిక్కుళ్లు రూ.100, బంగాళదుంప రూ.50
- రెండు వారాల్లో రూ.20 నుంచి రూ.30 వరకు పెరుగుదల
- వర్షాలకు పంట పోవడంతో ధరలు పెరిగాయంటోన్న వ్యాపారులు

గుంటూరు, సెప్టెంబరు 20: కూరగాయ ధరలు కొండెక్కాయి. ఏ కూరగాయలు కూడా కొనేస్థితిలో లేవు. కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లిన ప్రజలు వాటి ధరలు చూసి కళ్లు తేలేస్తున్నారు. మార్కెట్లతో పాటు రైతు బజార్లలోనూ కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. కూరగాయల ధరలు మంటెక్కుస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని కూరగాయల ధరలు సాధారణంగా ఉంటే మరికొన్ని అమాంతం పెరిగిపోయాయి. ఇటీవల భారీ వర్షాలు, ముంచెత్తిన వరదలతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో కూరగాయ పంటలు నీట మునిగిపోయాయి. ఈ ప్రభావం వాటి ధరలపై పడింది. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండే దొండకాయ, వంకాయ ధరలు కూడా ప్రస్తుతం కిలో రూ.60కు చేరుకున్నాయి. ఇక మొన్నటి వరకు కిలో రూ.60 ధర పలికిన బెండకాయ ధర కాస్త దిగొచ్చి రూ.40 చేరుకుంది. పెద్ద మార్కెట్లోనే ధరలు ఇలా ఉంటే ఇక కాలనీల్లోని చిల్లర దుకాణాల్లో అంతకు మించి కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు పెంచి విక్రయిస్తున్నారు. ఇక పెద్ద చిక్కుళ్లు కాపు పెద్దగా లేదని కిలో రూ.100 విక్రయిస్తున్నారు. బంగాళదుంప కూడా కిలో రూ.50 వరకు పలుకుతుంది. రాష్ట్రంలో లభ్యత లేక పోవడంతో బెంగళూరు నుంచి దిగుమతి చేసుకోవడంతో క్యాలీ ఫ్లవర్ ఒక్కోటి రూ.50 నుంచి రూ.40 వరకు సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఇక మార్కెటింగ్‌శాఖ నిర్వహించే రైతు బజార్లులో మాత్రం ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 వర కు విక్రయిస్తున్నారు. అయితే అవి కూడా నాశిరకంగా ఉం టున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఆకుకూరల ధరలూ అదుర్స్..

వర్షాలు, వరదలతో ఆకు కూరలు పొలాల్లోనే పాడ య్యాయి. దీంతో దిగుబడి లేక వాటి ధరలు కూడా అ మాంతం పెరిగాయి. గొంగూర కట్ట రూ.10 ఉండగా తోట కూర, పాలకూర, చుక్కకూర కట్ట మార్కెట్లోనే రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. కాలనీ ల్లోని దుకాణాల్లో కట్ట రూ.20కు విక్రయిస్తున్నారు. ఇక కొత్తి మీర కట్ట రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయి స్తున్నా రు. మరికొన్ని రోజులు ఇవే ధరలు కొనసాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

- కారంచేడు మండల పరిధిలో ఎండిపోయిన వరి పైరు



సాగునీటి కోసం..

- నర్సాయపాలెం లాకులు ఎత్తిన కారంచేడు రైతులు
- నీటిని దిగువకు పంపిస్తే తమ పరిస్థితి ఏమిటన్న బాపట్ల రైతులు
- ఇరుపక్షాల రైతులతో సమావేశమైన నీటిపారుదల శాఖ అధికారులు
- మంత్రి నిమ్మల సూచనలతో సమస్యను పరిష్కరించిన యంత్రాంగం


బాపట్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండు వారాల క్రితం వరదలు ముంచెత్తగా ప్రస్తుతం సాగునీరు అందక పంటలు ఎండిపోయే విచిత్ర పరిస్థితి కొమ్మమూరు కాల్వ పరిధిలోని కృష్ణా పశ్చిమ డెల్టా చివరి ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్నారు. కొమ్మ మూరు కాల్వకు పూర్తి సామర్థ్యం మేరకు 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే బాపట్ల, పర్చూరు, చీరాల పరిధిలోని చివరి ఆయకట్టు వరకు నీరందుతుంది. అయితే అధ్వానంగా మారిన కాల్వలు, అధికారుల మధ్య సమన్వయ లోపంతో చివరి ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. దిగువకు నీరు వదలక పోవడంతో పర్చూరు నియోజకర్గ పరిధిలోని దాదాపు 90,000 ఎకరాల ఆయకట్టు ప్రమాదంలో పడింది. దీంతో కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు నుంచి రైతులు శుక్రవారం బాపట్ల మండలం నర్సాయపాలెం లాకుల వద్దకు చేరుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటి పంపిణీలో అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో కారంచేడు నుంచి వచ్చిన రైతులు నర్సాయపాలెం లాకులను ఎత్తి నీటిని దిగువకు విడు దల చేశారు. కారంచేడు కాల్వలో 6 అడుగుల మేర నీటి ప్రవాహం ఉంచాలని రైతులు డిమాండ్ చేశారు. అదే సమయంలో బాపట్ల మండల పరిధిలోని రైతులు కూడా అక్కడికి వచ్చారు. నీటిని దిగువకు పంపిస్తే తమ పొలాల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఇరు ప్రాంతాల రైతులు మొహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈఈ మల్లికార్జునరావు, బాపట్ల జేఈ సాంబశివరావు రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పంటలు ఎండిపోతున్నాయని కారం చేడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తే కాల్వ గతంలో మాదిరిగా గండ్లు పడుతాయనే దశలవారీగా నీటి విడుదలను చేపడుతున్నట్లు అధికారులు రైతులకు చెప్పారు.

మంత్రి ఆదేశాలతో..

సాగునీరందక ఇబ్బందులు పడుతున్న విషయం మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన రైతులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పరిస్థితిని 24 గంటల్లో చక్కదిద్దాలని అధికారులను ఆదేశించారు. సాగునీటిని అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. కొమ్మమూరు కాల్వ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేసి కారంచేడు కాల్వలో నీటి ప్రవాహం 6 అడుగులు ఉండేలా చూడడంతో పాటు ఇటు నర్సాయపాలెం లాకుల వద్ద 5.5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉండేలా చూస్తామని, తద్వారా చివరి ఆయకట్టుకు కూడా నీరందుతుందని అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి ఆదేశాలతో లాకుల వద్దే రాత్రి వరకు ఉన్న అధికారులు దిగువకు నీటిని విడుదల చేయడంతో పాటు బాపట్ల మండల పరిధిలోని రైతులకు కూడా అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టారు

ప్రణాళిక లోపం.. రైతుల మధ్య విద్వేషాలు

కాల్వకు పడిన గండ్ల మరమ్మతులకు తోడు అధికారులకు నీటి విడుదలలో సరైన ప్రణాళికలు కొరవడడం కూడా ప్రస్తుతం పరిస్థితి చే ం ఎ ఎ దా ట డా ని కి కారణంగా ఉంది. నీటి విడుదలలో ఎగువన ఉన్న కాల్వలకు, దిగువన ఉన్న కాల్వల మధ్య సమన్వయం విషయంలో అధికారుల బాధ్యతా రాహిత్యం కనబడుతోంది. బాధ్యత తీసుకోవాల్సిన జలవనరుల శాఖ అధికారులు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుని నీటి అవసరాలకు కావాల్సిన సిఫారసులను పై అధికారులకు పంపించి వాటిని సా ధించ ఎకోవ డంలో విఫలమవడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణంగా ఉంది. పర్చూరు నియోజకవర్గ రైతుల డిమాండ్ మేరకు బాపట్ల పరిధిలోని కాల్వలకు నీటి సరఫరాను నిలిపివేసి దిగువకు పంపించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టడంతో ఇక్కడి రైతులు అభ్యంతరం వెలిబుచ్చారు.



నర్సాయపాలెం కాల్వ లాకులను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న కారంచేడు రైతులు

సింగిలా.. సిండికేటా



- మద్యం దుకాణాలపై మంతనాలు
- త్వరలో విడుదల కానున్న నోటిఫికేషన్
- అప్పుడే రంగంలోకి దిగిన నేతల అనుయాయులు
- అమ్మకాలు ఎక్కువగా ఉండే షాపులపై ప్రత్యేక దృష్టి

చీరాల, సెప్టెంబరు 20: రెండు, మూడు రోజుల్లో మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. దీంతో కొత్తవారితో పాటు, ఆ రంగంలో గతంలో ఉన్నవారు ఒక్కసారిగా తెరపైకి వచ్చారు. వారి వెనుక కూటమి నేతల అనుయాయులు చక్రం తిప్పేందుకు కసరత్తు చేస్తున్నారు. మద్యం దుకాణాలను పొందేందుకు సింగిల్‌గా పోదామా, సిండికేట్‌గా పోదామా అనే విషయంపై ఆయా వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. సేల్స్ ఎక్కువగా ఉండే దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇదిలా ఉంటే గీత కార్మికులకు అదనంగా 10 శాతం దుకాణాల కేటాయింపు నేపథ్యంలో ఆ సామాజికవర్గానికి చెందిన కొందరు వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ప్రస్తుతం 111 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. అద్దంకి, చీరాల, పర్చూరు, బాపట్ల, వేమూరు, రేపల్లె, నగరం సర్కిళ్లు ఉన్నాయి. అక్టోబరు 1 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానున్నది. మద్యం దుకాణాల లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో కొత్త వారితో పాటు, గతంలో మద్యం దుకాణాలు నిర్వహించినవారు తెరపైకి వస్తున్నారు. మద్యం వ్యాపారులు రాజకీయ పార్టీల పరంగా ఏవైపు ఉన్నా, వ్యాపార పరంగా అంతర్లీనంగా సిండికేట్‌గా తమ దందాను సాగించేందుకు ఇష్టపడుతుంటారు. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల లైసెన్స్ పొందేందుకు సింగిల్‌గా వెళదామా, సిండికేట్‌గా వెళదామా అనే కోణంలో మంతనాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో కొందరు అధికార పరంగా అన్ని మేం చూసుకుంటాం, పెట్టుబడులు మీరు పెట్టండి సిండికేట్‌గా ముందుకు సాగితేనే అందరికీ ప్రయోజనం అనే కోణంలో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. జిల్లా పరిధిలో ఒక్కో దుకాణానికి 10 మంది దరఖాస్తులు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధిక విక్రయాలు జరిగే దుకాణాలపై దరఖాస్తుదారులతో పాటు కొన్ని చోట్ల రాజకీయ నాయకులు ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అయినా ఆయా దుకాణాలకు 10 కన్నా అదనంగా దరఖాస్తులు చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని కొందరు నేతలు, వ్యాపారులు మంతనాలు చేస్తున్నట్లు సమాచారం.

తొలుత నోటిఫికేషన్ విడుదల

జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాలు 111 నడుస్తున్నాయి. నూతన మద్యం విధానం ప్రకారం కొత్త దుకాణాలకు రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుద లవుతుంది. ముందుగా 111 మద్యం దుకాణాలకే దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుంది. గీత కార్మికులకు సంబంధించి 10 శాతం కేటాయింపు ఉండొచ్చు.

\- అరుణకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, బాపట్ల

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

విద్యాశాఖాధికారులతో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 20: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పిండి పదార్థాలు, ప్రొటీన్లు, ఫైబర్, మినరల్స్‌తో కూడిన పోషకాహారం అందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మండల విద్యాశాఖాధికారులతో శుక్రవారం వర్చువల్ విధానంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బడిలోనే మంచి భోజనం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. మెనూ పక్కాగా అమలు చేయాలని తెలిపారు. భోజనం తయారీలో నాణ్యత పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన సమయానికి పాఠశాలలను అధికారులు సందర్శించి పరిసరాలను, పరిశుభ్రతను పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహణపై అభిప్రాయాలు, సూచనలు స్వీకరించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల అభిప్రాయాలు తెలియపర్చాలన్నారు. మండలాలు నుంచి వచ్చే సూచనల మేరకు మార్పులు చేయడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు, ఏఎస్‌వో సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

పర్యావరణం - అధ్యయనం

దిక్సూచి
DIKSUCHI

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్య శక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

- **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.
- **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) **శీతోష్ణస్థితిపరమైనవి:** కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) **భౌతికపరమైనవి:** గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) **రసాయనికపరమైనవి:** సేంద్రీయపరమైన కార్బొహైడ్రేట్స్, ప్రోటీన్స్, లిపిడ్స్ నిరీంద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం	బి) జలావరణం
సి) శిలావరణం	డి) జీవావరణం

ఎ) వాతావరణం: ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో అట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలి పొరను వాతావరణం అంటారు.

- భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర ఉంది.
- వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.
- వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.
- వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.
- గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.
- ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)
- **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ
- **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

వాతావరణం లక్షణాలు

- దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒకచోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.
- ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.
- భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.
- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్‌ఎస్‌ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.



వి.వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి

నవ్వుతూ జీవించడం నాన్న నేర్పించారు

నాగార్జున

మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'కింగ్ ఆఫ్ ద సిల్వర్ స్ర్కీన్ ఫిల్మ్ ఫెస్టివల్'ను శుక్రవారం అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు అక్కినేని నాగార్జున. హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డీ.సి. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో 31 నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. 'దేవదాసు' చిత్రంతో ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నవ్వుతూ జీవించడాన్ని నాన్న మాకు నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుని నవ్వుతుంటాం. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్న శివేంద్ర సింగ్ దుంగార్పూర్‌కు ధన్యవాదాలు. వాళ్ల సెలెక్ట్ చేసిన చిత్రాల ప్రింట్స్ చక్కని క్వాలిటీతో ఉన్నాయి. నార్త్‌లో ఈ ఫెస్టివల్‌కు మంచి స్పందన వస్తోందని శివేంద్ర చెప్పారు. నాన్నగారి శత జయంతి రోజున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి నాన్నగారి సీనియర్ అభిమానులు హైదరాబాద్ వచ్చారు. వారికి కూడా ధన్యవాదాలు' అని చెప్పారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ 'నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బాపుగారు గీసిన ఫొటోతో స్టాంప్ రూపొందింది. ఈ రోజే స్టాంప్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు' అన్నారు. కేంద్రసమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 'నవంబర్‌లో గోవాలో నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అక్కినేని చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొన్నారు.







చిరంజీవికి అక్కినేని అవార్డ్

మెగాస్టార్ చిరంజీవికి ఏయన్నార్ జాతీయ అవార్డ్ ఇవ్వనున్నట్లు హీరో నాగార్జున శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 28న ఈ అవార్డ్‌ను ఆలిండియా మెగాస్టార్ అమితాబ్ చేతుల మీదుగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఇకపై రెండేళ్లకు ఒకసారి ఈ అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయం చెప్పగానే చిరంజీవి ఎమోషనల్ అయ్యారనీ, ఇంతకంటే పెద్ద అవార్డ్ లేదన్నారని నాగార్జున చెప్పారు.లుగు చిత్ర పరిశ్రమలోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులకు తన పేరుతో జాతీయ అవార్డ్ ఇచ్చి సత్కరించాలని అక్కినేని తన పేరుతో జాతీయ అవార్డ్ ప్రారంభించి తొలిసారిగా 2006లో బాలీవుడ్ నటుడు దేవానంద్‌కు ఇచ్చారు. ఏటా క్రమం తప్పకుండా అవార్డులు ఇవ్వడానికి టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షుడిగా రూ.కోటి మూలధనంతో అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.



మళ్లీ కెమెరా ముందుకు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రం మొదటి భాగంలో మిగిలిన షూటింగ్ చేయడానికి సమయం కేటాయించారు. ఈ నెల 23 నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ సారథ్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నట్లు నిర్మాత దయాకరరావు చెప్పారు. ఇంతకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించడానికి దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాకు సమర్పకుడు.

కె.బాలచందర్ స్త్రీలోలుడు

- గాయని సుచిత్ర





తమిళ దర్శక శిఖరం కె.బాలచందర్ ఓ స్త్రీలోలుడు అని గాయని, నటి సుచిత్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన జీవించివున్నంతకాలం కామవాంఛతో రగిలిపోయారంటూ ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'కె.బాలచందర్ చనిపోయేంత వరకు ఒక 'లస్ట్‌మేన్'గా ఉన్నారు. మహిళలను తప్పుడు దృష్టికోణంలోనే చూశారు. వారిపట్ల అసభ్యంగా నడుచుకున్నారు. ఆయన గురించి అనేక మందికి తెలుసు. నన్ను కూడా కొందరు ఫామ్‌హౌస్‌లకు రమ్మని పిలిచారు. కానీ, నేను వెళ్ళలేదు' అని చెప్పారు. ఆమె ఆరోపణలను తమిళ చిత్ర దర్శకుల సంఘం, దక్షిణ భారత సినీ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి. తమిళ చిత్రపరిశ్రమకు ఎంతో మేలు చేసి, అనేక అవార్డులు అందుకుని, అనేకమంది యువ దర్శకులకు మార్గనిర్దేశం చేసిన కె.బాలచందర్‌ను ఉద్దేశించి సుచిత్ర చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, కోలీవుడ్ సినీ దర్శకుడు సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ విడుదల చేసిన ప్రకటనలో, ' భౌతికంగా మన మధ్యలేని గొప్ప వ్యక్తి గురించి ఇలా మాట్లాడి, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఓటుకు నోటు కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి!

- కేసు దర్యాప్తులో జోక్యం వద్దని రేవంత్‌కు ఆదేశం
- క్షమాపణలను అంగీకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎంకు నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. రేవంత్‌రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని కోర్టు మరోసారి హితవు పలికింది. ప్రజాస్వామ్యంలోని 3 కీలక వ్యవస్థలు తమ పరిధిలోని రాజ్యాంగ విధులను నిర్వర్తించాలని సూచించింది.

టిడ్కో సముదాయాలు ఇక 'ఎన్టీఆర్ నగర్'లు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాలనీలకు ఇక నుంచి పీఎంఏవై-ఎన్టీఆర్ నగరాలుగా పేరు మార్చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత వాటికి వైఎస్ఆర్ జగనన్న నగరాలుగా పేరు పెడుతూ అప్పట్లో మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ కాలనీలకు ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చారు.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్

- రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- దురుద్దేశంతోనే బాలికను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు
- చేరిన నెలలోపే ముంబైకి తీసుకెళ్లి అత్యాచారం
- రిమాండ్ రిపోర్టులో వెల్లడి



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబర్ 3 వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందని తెలిపారు. 2019, డిసెంబర్ 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్ హిట్ సినిమాకు పనిచేశారని పేర్కొన్నారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబై వెళ్లారని.. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియ పెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 ఏళ్లని తెలిపారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానంటూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోయిందన్నారు. చెప్పినట్టు వినకుంటే షూటింగ్ లోకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆమెపై ఒత్తిడి కూడా తెచ్చేవాడని వెల్లడించారు. రోజురోజుకూ అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని, ఏదో పార్సిల్ పంపి భయపెట్టాలని చూశారని పోలీసులు పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి బాధితురాలు.. జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్‌కు చెప్పుకొందని, అతని సూచన మేరకే పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులు విధుల్లో చేరాలి: కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సేవలు నిత్యావసర, అత్యవసరమైనవి అయినందున పీహెచ్‌సీ వైద్యులంతా వెంటనే విధుల్లో చేరాలని ఆరోగ్యశాఖ కమిషనర్ పి.హరికిరణ్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యులకు, డా.యూనస్‌కు ఆయన లేఖ రాశారు. ఇన్‌సర్వీస్ రిజర్వేషన్‌కు సంబంధించి పీహెచ్‌సీ డాక్టర్లు తమ ఆందోళనలను తిరిగి ప్రారంభిస్తారంటూ పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.యూనస్ మీర్ ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు లేఖ అందించారు. దానిపై స్పందించిన ఆరోగ్య శాఖ కమిషనర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని తిరిగి లేఖ రాశారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు తన లేఖలో వాడిన భాష, ఆందోళన కార్యక్రమాల కొనసాగింపు ప్రతిపాదన ఈనెల 18న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు.

ఒకేరోజు 1.03కోట్ల పుస్తకాల పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను ఒకేరోజు పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రెండో సెమిస్టర్‌కు సంబంధించిన 1.03కోట్ల పుస్తకాలను ఈనెల 30న పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే మండల పాయింట్లకు పుస్తకాలు చేరుకున్నాయని, 28లోగా పాఠశాలలకు చేరుకుంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.వి జయరామరాజు తెలిపారు. 30న పంపిణీ ఈ ప్రక్రియను ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

నాపై పరువు నష్టం కేసు కొట్టివేయండి

- హైకోర్టుకు జగన్... ఎల్లుండి విచారణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో మంత్రి నారాయణ తనపై వేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వద్ద విచారణకు రానుంది. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో మంత్రి నారాయణ, విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో జగన్మోహన్‌రెడ్డి, తదితరులపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో కోర్టు పలుసార్లు సమన్లు జారీ చేసినా జగన్ వాటిని అందుకోలేదు. పాస్‌పోర్టు పునరుద్ధరణ నిమిత్తం ఎన్‌వోసీ కోసం ఇటీవల ఆయన విజయవాడ కోర్టును ఆశ్రయించగా, ఎన్‌వోసీ జారీకి షరతులు విధించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది. పరువునష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు జగన్‌కు తాజాగా సమన్లు ఇచ్చింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు.

విద్యార్థినులకు డైట్ చార్జీల పెంపు

కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల, కలికిరి, కంచికర్ల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థినులకు డైట్ చార్జీలు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రూ.1,400 నుంచి రూ.1,600కు పెంచింది.

నా ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి
- కేసు కొట్టేయాలంటూ అఫిడవిట్.. తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు
- ఈ నెల 25న నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకొంది. ఎమ్మెల్యే లైంగికంగా వేధించాడని కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను చేసిన ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని న్యాయస్థానానికి నివేదించారు. ఈ మేరకు న్యాయవాదితో నోటరీ చేసిన అఫిడవిట్ దాఖలు చేశామని ఆమె తరఫు న్యాయవాది జితేందర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. న్యాయస్థానం సైతం ఫిర్యాదుదారును పిలిచి మాట్లాడగా వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేశానని, ఆదిమూలంపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ వివరాలు పరిగనణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ నెల 25న తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. అప్పటివరకు ఆదిమూలంపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడి చేసి, అత్యాచారానికి పాల్పడ్డారంటూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ నుంచి సస్పెండ్ అయిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ఫిర్యాదుదారు నేరుగా కోర్టుకు హాజరయ్యారు. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనపై కేసు నమోదులో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించలేదు. మహిళా పోలీసు అధికారిణి కేసు నమోదు చేయాల్సి ఉండగా, పురుష అధికారి కేసు పెట్టారు. ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవు. జూలై, ఆగస్టు నెలల్లో ఘటన జరిగితే సెప్టెంబరు 5న ఫిర్యాదు చేశారు. మూడో వ్యక్తి చేసిన ఒత్తిడితోనే మహిళ కేసు పెట్టింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలి' అని కోరారు. బాధిత మహిళ తరఫున న్యాయవాది జితేందర్ వాదనలు వినిపిస్తూ... పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని బాధితురాలు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. దానిని పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలని కోరారు.

ముందస్తు బెయిలు మంజూరు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి కాంతి రాణా తాతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ముందు విచారణకు రానుంది. ఆ పిటిషన్‌లో... 'తన ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారని, తప్పుడు క్రిమినల్ కేసు పెట్టి పోలీసుల చేత అరెస్ట్ చేయించి వేధించాడని కుక్కల విద్యాసాగర్‌పై సినీనటి కాదంబరి జత్వాని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా కుక్కల విద్యాసాగర్, ఇతరులని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. ఫిర్యాదులో నాపై నిర్దిష్టంగా ఎలాంటి ఆరోపణలు లేవు. జత్వానిపై కేసు, ఇంటిలో సోదాలు, అరెస్టు వ్యవహారంలో చట్ట నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఇప్పటికే నన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. వ్యాజ్యం తేలేవరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని కాంతిరాణా తాతా కోరారు.

గ్రీన్ గ్రేస్ అక్రమాలపై చర్చకు సిద్ధం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 20: వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ గ్రీన్ గ్రేస్ అక్రమ నిర్మాణాలపై చర్చకు ఎక్కడికి రమ్మన్నా తాను సిద్ధమేనని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ అక్రమ కట్టడాల విషయంలో తాను చేసిన ఆరోపణలకు సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. అంబటి మురళి ఏంచేసినా ఎదుర్కొవటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని గుంటూరు పట్టణంలో కోట్లాది రూపాయల విలువ చేసే భజరంగ్ జూట్ మిల్లుకు సంబంధించిన 5.17 ఎకరాల భూమిని అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. భూ యజమానులను బెదిరించి తక్కువ ధరకు భూములు చేజిక్కించుకున్నారని ఆరోపించారు. 500 పైబడిన ఫ్లాట్లు ఉన్న ఈ నిర్మాణాల్లో ల్యాండ్ ఓనర్స్‌కు కేవలం 87 ఫ్లాట్లే ఇచ్చేలా అగ్రిమెంట్ జరిగిందన్నారు. భూమి డెవలప్‌మెంట్‌కు ఇస్తే ఫిఫ్టీ ఫిఫ్టీ దామాష ప్రకారం ఫ్లాట్లు దక్కుతాయని ప్రజలందరికీ తెలుసన్నారు. కేవలం అధికారాన్ని అడ్డంపెటుకుని ఈ ప్రాజెక్ట్‌ను చేజిక్కించుకున్నారని ధ్వజమెత్తారు. భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులపై కూడా విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. అధికారుల తప్పిదాలతో ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందన్నారు. తనకు తెలిసి నిర్మాణాలపై స్టాప్ ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు కొనసాగించటం అనుమానాలకు తావిస్తుందన్నారు. అంబటి మురళి చూపిస్తున్న అనుమతులు ఒక టవర్‌కు సంబంధించేనన్ని, మిగిలిన నిర్మాణాలకు అనుమతులు లేవన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగులతో అడ్డగోలుగా సంతకాలు పెట్టించుకున్నట్లు స్పష్టం అవుతుందన్నారు. గ్రీన్ గ్రేస్ అక్రమ నిర్మాణాలను నిరూపించటానికి తాను సిద్ధంగా ఉన్నానని నరేంద్ర కుమార్ సవాల్ విసిరారు. తనవి రాజకీయ ఆరోపణలు కావని, 500 పైబడిన వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా పోరాడుతున్నట్లు నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.


మిర్చియార్డుకు ఎన్టీఆర్ పేరును విస్మరించారు

● వైసీపీ పాలనలో తొలగింపు
● తక్ పట్టీ పుస్తకాలపై అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పేరు మాత్రమే ముద్రణ

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్టీఆర్ చేసిన సేవలకు గుర్తింపుగా మిర్చియార్డుకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీనందమూరి తారక రామారావు మార్కెట్ యార్డు, గుంటూరు అని పేరు మార్చగా వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని అమలు చేయలేదు. ఎన్టీఆర్ పేరు ఎక్కడా పరిపాలన వ్యవహారాల్లో కనిపించకుండా చేశారు. రైతు, కమీషన్ ఏజెంట్ అమ్మకం (తక్ పట్టీ) పుస్తకాలపై కేవలం అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుంటూరు అని మాత్రమే ముద్రించి పంపిణీ చేశారు. దీనిపై ఎన్టీఆర్ అభిమానులు ప్రశ్నించినా మిర్చియార్డు యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రికార్డులలో ఒక పేరు, తక్ పట్టీ పుస్తకాలపై మరో పేరు ఉన్న నేపథ్యంలో జీఎస్టీ అధికారులు పట్టుకుంటే తమకు ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాపారస్థులు వాపోతున్నారు.

2017లో జీవో జారీ..

2017 ఏప్రిల్ 19వ తేదీ వరకు మిర్చియార్డు పేరు అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుంటూరు అని ఉండేది. అప్పటి యార్డు పాలకవర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఎన్టీఆర్ పేరుని చేర్చాలని ప్రతిపాదించగా మార్కెటింగ్ శాఖ ఆమోదం తెలిపి జీవో ఆర్‌టీ నంబరు. 243ని ఆ ఏడాది ఏప్రిల్ 20న జారీ చేసింది. దాని ప్రకారం ఆ రోజు నుంచే శ్రీనందమూరి తారక రామారావు మార్కెట్ యార్డు, గుంటూరుగా రికార్డులలో మారిపోయింది.



ఎన్టీఆర్ పేరు లేకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీ ముద్రించిన తక్ పట్టీ పుస్తకాలు

అప్పట్లో యార్డు ముఖద్వారం వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అలానే పరిపాలన వ్యవహారాల్లోనూ ఈ పేరునే వినియోగించేవారు. ఎప్పుడైతే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేసిందో అప్పటి నుంచి ఎన్టీఆర్ పేరుని తొలగించేసింది. ఎన్టీఆర్ పేరు ఎక్కడా కనపడకూడదన్నట్లుగా ఆఖరికి బిల్లు పుస్తకాలపైనా తీసేసింది.

వినియోగంలో మార్చేశారు..

నేటికీ మిర్చియార్డుకు ఎన్టీఆర్ పేరుతో జారీ చేసిన ఉత్తర్వులు యథాతథంగా అమల్లో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి సవరణ ఉత్తర్వులు కూడా విడుదల కాలేదు. అయినప్పటికీ వినియోగంలో పేరు మార్చేశారు. ఇప్పటి వరకు జీఎస్టీ అధికారులు ఎలాంటి అభ్యంతరం పెట్టకపోవడం వలన మిర్చి లావాదేవీలు సాఫీగా సాగిపోతున్నాయి. లేకుంటే పరిపాలన పరంగా తాము ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చేదని వ్యాపారస్థులు చెబుతున్నారు. ఇకనైనా జీవో ప్రకారం ఎన్టీఆర్ పేరుని అన్ని స్థాయిల్లో అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన ద్రోహులను కఠినంగా శిక్షించాలి

దుగ్గిరాల, సెప్టెంబరు 20: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా పవిత్ర తిరుమల లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన ద్రోహులను కఠినంగా శిక్షించాలని దుగ్గిరాల గ్రామ తెదేపా నాయకులు పేర్కొన్నారు. తిరుమలలో జరిగిన అపవిత్ర కార్యక్రమాలకు గత వైసీపీ ప్రభుత్వమే కారణమని పేర్కొంటూ మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దిష్టిబొమ్మలను శుక్రవారం దహనం చేశారు. మండలకేంద్రం దుగ్గిరాలలోని శివాలయం సెంటర్లో జరిగిన దిష్టిబొమ్మల దహనం సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ టీఎన్‌యూఎఫ్ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన బాధ్యులందరిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, టీటీడీ ధార్మిక మండలి సభ్యులు చుండూరు ఉమామహేశ్వరరావు, పసుపులేటి గణేష్ మాట్లాడుతూ కలియుగదైవం వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిని ఉరి తీయడమే సమంజసం అన్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు



దుగ్గిరాల శివాలయం సెంటర్లో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి దిష్టిబొమ్మల దహనంలో కూటమి నాయకులు

దేవరపల్లి చంటి, నక్కా చిరంజీవి, పసుపులేటి రవియాదవ్, దోస్త్ సభ్యులు గద్దె శ్రీనివాస్, నూకతోటి రవి, పేర్లి వంశీ, లాలూ నాయక్, లక్ష్మానాయక్, చింతమనేని మహేష్, నవీన్ గౌడ్, వీరంకి నాగేశ్వరరావు, ప్రసాద్, లియాఖత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్‌టాప్ శాస్త్రవేత్తల్లో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 20: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆరుగురు అధ్యాపకులు వరల్డ్ టాప్ శాస్త్రవేత్తల్లో చోటు సాధించారని వీసీ ఆచార్య పి.నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతంలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఈ మేరకు నిర్వహించిన సర్వేలో తమ అధ్యాపకులు 2శాతం మంది ఉన్నారని వివరించారు. విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన ఆచార్య అంబటి రంగారావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, మెకానికల్ విభాగానికి చెందిన ఆచార్య కె.వెంకటరావు, ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ రుద్రపాల్ మిథున్, అడ్వాన్స్ సీఎస్ఈ విభాగానికి చెందిన డాక్టర్ జ్యోత్స్నాదేవి, కెమికల్ విభాగానికి చెందిన ఆచార్య టి.సుబ్బయ్య తదితరులు ఉన్నారని తెలిపారు. అధ్యాపకులకు సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అభినందించారు.



అధ్యాపకుల్ని అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

వయోవృద్ధులకు అవసరమైన పరికరాలు అందజేయాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశంలో జేసీ భార్గవ్ తేజ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 20: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వయోవృద్ధులకు అవసరమైన పరికరాలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ రెవిన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వయోవృద్ధులకు అవసరమైన వీల్ చైర్స్, హియరింగ్ మెషిన్లు, చేతికర్రలు త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు. అన్ని వృద్ధాశ్రమాలు తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో ఇంటర్, ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థులను జాయిన్ చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైల్వే డీఎస్పీగా అక్కేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



గుంటూరు, సెప్టెంబరు 20: గుంటూరు రైల్వే డీఎస్పీగా పి.అక్కేశ్వరరావును నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గుంటూరు రైల్వే స్టేషన్‌లోని జీఆర్‌పి స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఐగా ఆయన ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో పనిచేశారు నగరంలో ట్రాఫిక్ సీఐగా కూడా కొంతకాలం విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ అక్కేశ్వరరావును ఆర్పి ఎస్ఐలు రమేష్ (గుంటూరు), వెంకటాద్రి (తెనాలి), సరస్వతి (బాపట్ల), సుబ్బారావు (నరసరావుపేట), శ్రీనివాసరావు నాయక్ (నడికుడి), ఆర్‌పిఎఫ్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

పొలాల్లో జంట ఆత్మహత్యాయత్నం

● మహిళ మృతి, పురుషుడి పరిస్థితి విషమం

చేబ్రోలు, సెప్టెంబరు 20: నారాకోడూరు శివారులోని పంట పొలాల్లో గుర్తుతెలియని జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం నారాకోడూరు శివారు పంట పొలాల్లో పురుషుడు, మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సరికి మహిళ మృతి చెందింది. పురుషుడి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వారి వివరాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు ఆర్థిక చేయూత



చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు అంజేస్తున్న డాక్టర్ నెల్లూరి రమేష్, పూనాటి శ్రీనివాసరావు

నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విరాళం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20: వరద బాధితులకు నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చారు. గురువారం ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్ చేతుల మీదగా రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన అసోసియేషన్ సభ్యులను నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. లారీ యజమానులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న నసీర్ అహమద్, లారీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ప్రియదర్శినీ విద్యాసంస్థల సిబ్బంది

ప్రియదర్శినీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో..

దుగ్గిరాల, సెప్టెంబరు 20: వరద బాధితుల సహాయార్థం దుగ్గిరాల మండలం, చింతలపూడిలోని ప్రియదర్శినీ విద్యాసంస్థల సిబ్బంది ఒక రోజు వేతనం రూ.2లక్షల చెక్కును రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం అందించారు. చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతృత్వాన్ని చాటుకున్న పమిడిపాడు..

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20: వరద బాధితులను ఆదుకునేందుకు నరసరావుపేట మండలం పమిడిపాడు ప్రజలు కుల, మత, పార్టీలకు అతీతంగా స్పందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ నెల్లూరి రమేష్ బాబు సంకల్పించగా, రొంపిచర్ల ఆంజనేయులు ప్రోత్సాహంతో పూనాటి శ్రీనివాసరావు, నలమాల పూర్ణచంద్రరావు, నలమాల బాజీ, పోపూరి శ్రీను, జుజ్జూరీ సాంబయ్య, సహకారంతో రూ.5 లక్షలు సేకరించారు. రూ.5 లక్షల చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వెలగపూడి సచివాలయంలో కలిసి ఇచ్చామని పూనాటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పమిడిపాడు ప్రజలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు వీఐటీకి గవర్నర్ రాక

తుళ్లూరు, సెప్టెంబరు 20: మండల పరిధిలోని ఐనోలు రెవెన్యూలో ఉన్న వీఐటీ -ఏపీ అమరావతి విశ్వవిద్యాలయానికి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం రానున్నారు. వీఐటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వీఐటీ యాజమాన్య ఆహ్వానం మేరకు ఉదయం 10 గంటలకు హాజరు కానున్నారు. సభలో ఆయన ప్రసంగిస్తారు.

సీబీఐ ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా శ్రావణ్ కుమార్



గుంటూరు (లీగల్), సెప్టెంబరు 20: గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది మన్నవ శ్రావణ్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సీబీఐకి సంబంధించిన కేసులను విచారించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టులో ఇప్పటి వరకు ఆ శాఖకు సంబంధించిన పెండింగ్ కేసుల విషయమై చర్చించేందుకుగానూ వెంటనే విశాఖపట్నం కార్యాలయానికి రావాల్సిందిగా ఆయనకు ఆదేశాలు జారీ చేశారు. శ్రావణ్ కుమార్ గుంటూరు కేంద్రంగా గత 3 దశాబ్దాలకుపైగా సీనియర్ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. పలు బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలకు న్యాయ సలహాదారుగా పనిచేస్తున్నారు.

విజయవాడ మార్గంలో పలు రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా విజయవాడ మార్గంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన నంబరు 22708 తిరుపతి - విశాఖపట్నం, 30న నంబరు 22707 విశాఖపట్నం - తిరుపతి, నంబరు 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, నంబరు 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, 30 తేదీల్లో నంబరు 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి, ఈ నెల 30, అక్టోబరు 1వ తేదీల్లో నంబరు 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

జాతీయ క్యారమ్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు



క్రీడాకారులను అభినందిస్తున్న అబ్దుల్ జలీల్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20: విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ క్యారమ్స్ పోటీల్లో జిల్లాకు చెందిన బీనవ్య, జీ.ముయాఖలు వరుసగా బంగారు, రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర క్యారమ్ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నీరజ్‌కుమార్, షేక్ అబ్దుల్ జలీల్, సంఘ చీఫ్ ప్యాట్రన్ యాంగటి దుర్గారావులు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 26 వరకు గ్వాలియర్‌లో జరిగే 49వ జాతీయ క్యారమ్స్ పోటీల్లో వీళ్లిద్దరూ ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

25 నుంచి అండర్ -19 విద్యార్థుల క్రీడా పోటీల ఎంపికలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 20: జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు క్రీడా పోటీల ఎంపిక ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్ సమాఖ్య కార్యదర్శి జీ. నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 26న రగ్బీ, సెపక్ టక్ర ఎంపికలు జడ్పీ స్కూల్ నందిగామ (సత్తెనపల్లి రూరల్)లో, 27న ఖోఖో ఎంపికలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల(అమరావతి)లో జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా ఎంపికల్లో పాల్గొనే విద్యార్థినీవిద్యార్థులు 2006 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలని, ప్రిన్సిపల్ సంతకం చేసిన పది మార్కుల జాబితా జిరాక్స్ తప్పనిసరిగా తీసుకుని పోటీలకు హాజరుకావాలని ఈ సందర్భంగా సూచించారు.

క్వారీ గుంతలో పడి బాలుడు మృతి

తుళ్లూరు, సెప్టెంబరు 20: అనంతవరంలో బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అనంతవరం కొండ వెనక క్వారీ గుంతలో పడి కొర్రా అనిల్ (16) మృతి చెందాడు. మధ్యాహ్నం గేదెలను తోలుకొని వెళ్లాడు. నీటి క్వారీ గుంతలో అవి దిగటంతో బాలుడు కూడా అందులో దిగాడు. లోతులోకి వెళ్లి మృతి చెందాడు. స్థానిక పాఠశాలలో 9వ తరగతి అనిల్ చదువుకుంటున్నాడు. తండ్రి శ్రీనివాసరావుకు ఒక్కడే కుమారుడు. సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 14,400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 20: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 29వేల క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు మేర ఎత్తి 14,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 14,605 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 20: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,973 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 46,516 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,516 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 20 : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 28,792 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 33,640 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారాను, మిగిలినవి ఒక గేటు ద్వారా దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

49,041 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 43,733 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,041 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,151 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	9000	16000
నెంబరు. 5	14500	15500	నెంబరు. 5	--	--
273	11200	11200	273	12500	12500
341	8800	11500	341	10000	17000
4884	--	--	4884	13000	13000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18500	తేజ	10000	18600
బ్యాడిగి	9000	14500	బ్యాడిగి	11000	11000
దేవనూరు డీలక్స్	9500	15500	దేవనూరు డీలక్స్	9000	16500
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	6000	10000



ఇంటింటి కెళ్ళి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులు

అభివృద్ధి, సంక్షేమం.. సీఎం చంద్రబాబు ఘనతే

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 20: ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తైందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని జీఎస్‌పాలెం గ్రామసచివాలయంలో శుక్రవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం, ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఆయన ఇంటింటికి వెళ్ళి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ పెంచటానికి ఐదేళ్లు పట్టిందని, అధికారంలోకి రాగానే చెప్పినమాట ప్రకారం 1000 పింఛన్ పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. 16,437మందికి డీఎస్సీ నోటిఫికేషన్ అమలు చేయటానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రంలో అన్నక్యాంటీన్‌లు ఏర్పాటుచేశారు. ల్యాండ్ టైటిల్‌యాక్ట్ రద్దుచేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గంధం రవీందర్, మండల ప్రత్యేకాధికారి సువార్త, ఎంపీడీవో భవనం మారుతీశేషమాంబ, తహసీల్దార్ మేహర్‌కుమార్, సర్పంచ్ దబ్బకూటి మాధవరావు, కార్యదర్శి కె.వసుంధరలక్ష్మీ, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాదర్బార్

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే ప్రజాదర్బార్ ఉద్దేశమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెలలో బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలతోపాటు పిట్టలవానిపాలెం టీడీపీ కార్యాలయంలో ప్రతి శుక్రవారం ప్రజాసమస్యల ప్రజాదర్బార్ నిర్వహిస్తామని ప్రజలు నుండి అర్జీలు స్వీకరించి వాటిని కూటమి నాయకులతో కలిసి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మైనార్టీ మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, జాలాది లోకరాజ్యుడు, సయ్యద్ నిజాం, మీరా బేతాళం నరసరాజు, ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

బాపట్ల, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేసి పని చేస్తున్నట్లు టీడీపీ బాపట్ల మండల నాయకులు పేర్కొన్నారు. మండలంలోని చుండూరుపల్లి, ఈతేరు, మర్రిపూడి గ్రామాలలో నాయకులు ఇంటింటా తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంచుతూ స్టిక్కర్లు అంటించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, స్పెషల్ ఆఫీసర్ బాషా, ఆరోగ్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వెల్లటూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజల నోట మంచి ప్రభుత్వమని ప్రశంస

● ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 20: వంద రోజుల పాలనలోనే ప్రజల నోటివెంట మంచి ప్రభుత్వం అనే ప్రశంసలు కూటమి ప్రభుత్వం అందుకుందని ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి వందరోజుల ప్రభుత్వ పనితీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు ప్రజలు వివరించగా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజావేదిక వద్ద మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అవినీతి, ప్రజలను దోచుకోవడం మినహా చేసిందేమి లేదని, జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తున్నామన్నారు. పింఛన్‌ను రూ.3వేల నుంచి రూ.4వేలు చేశామన్నారు. ఎన్నికల్లో హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రజావేదికలో పలువురు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో హేలాషారోన్, ప్రత్యేక అధికారి పిచ్చిరెడ్డి, జడ్పీటీసీ ఉదయభాస్కరి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, టీడీపీ నాయకులు మోటూరి పుణ్య శ్రీనివాసరావు, కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, వాకా శేషుబాబు, గొట్టిపాటి కృష్ణారావు, రాజేష్, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అబ్బనగూడవల్లిలో వాగ్వావాదం

● అవినీతిపై సర్పంచ్‌ని నిలదీసిన టీడీపీ నేత

వేమూరు, సెప్టెంబరు 20: మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వాగ్వావాదం జరిగింది. టీడీపీ యువజన నేత శోభిల రాజేష్ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ పరిధిలో జరిగిన అవినీతిపై సర్పంచ్ రాంబాబును నిలదీశారు. జగనన్న కాలనీలలో పంచాయతీ నిధులతో కొనుగోలు చేసిన ఐదు మోటార్లులో నాలుగు కనిపించకుండా పోయాయని, వాటిని సర్పంచ్ తస్కరించి అమ్ముకున్నాడని ఆరోపించాడు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఎస్టీ కాలనీకి పంపిన గ్రావెల్‌ను ముందుగా శ్మశానంలోకి తోలించి తిరిగి దానిని ఎస్‌టీ కాలనీకి సర్పంచ్ తరలించాడని దానిపై రెండు లక్షలకు బిల్లు కూడా పెట్టాడన్నారు. టీడీపీ, జనసేన వారికి పింఛన్లు శాంక్షన్ కాకుండా సర్పంచ్ ఇబ్బందులు పెట్టాడని ఆరోపించారు. దీనిపై ఆగ్రహించిన సర్పంచ్ రాంబాబు వివాదానికి దిగాడు. ఈ సందర్భంలో టీడీపీ, జనసేన, వైసీపీ సర్పంచ్ ముగ్గురి మధ్య కొద్దిసేపు వివాదం జరిగింది. అధికారులు, స్థానికులు చొరవతో వివాదానికి తెరదించారు. ప్రత్యేక అధికారి విలియమ్స్ ప్రభుత్వం తలపెట్టిన ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమానికి సంబంధించి ఉద్దేశాన్ని వివరించారు. వంద రోజుల పాలనలో అభివృద్ధికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలు, వివిధ పథకాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ, ఈవోపీఆర్‌డీ శేఖర్, కార్యదర్శి సురేష్, పీఆర్ ఏఈ మరియదాసు, ట్రాన్స్ ఏఈ గోపి, జనసేన నాయకులు సాయి, వివిధ శా ఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

కొల్లూరు, సెప్టెంబరు 20: ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పంపిణీ చేశారు. శుక్రవారం కొల్లూరు పంచాయతీ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి స్థానిక గౌడపాలెంలో ఇంటింటికి వెళ్లి గడిచిన 100 రోజుల్లో ప్రజలకు జరిగిన మంచిని మైనేని వివరించి కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబు నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి బాటలు పడతాయని చెప్పారు. శనివారం క్రాప గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు, కార్యదర్శి మల్లిఖార్జున, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బి.చలమయ్య, ఈమని మణికంఠ, బుర్రి జగన్, గాదె దుర్గారావు, ఈవోపీఆర్‌డీ రవిబాబు, గోగినేని వెంకటేష్, పోతార్లంక కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు...

రేపల్లె, సెప్టెంబరు 20: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీడీవో శివపార్వతి అన్నారు. శుక్రవారం రేపల్లె మండలం బేతపూడి గ్రామంలో ఎన్డీయే ప్రభుత్వం 100రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడితిపూడి నరసింహరావు, వీరయ్య, మాజీ ఎంపీపీ కారుమూరు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం మండలం ఆముదాలపల్లిలో..

రేపల్లె, సెప్టెంబరు 20: నూతన ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించటమే తమ లక్ష్యమని నిజాంపట్నం ఎంపీడీవో నర్రా నాగలక్ష్మీ అన్నారు. శుక్రవారం నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అవినీతి, అరాచకాలు తప్ప పేద ప్రజలను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు సంక్షేమపథకాలు అందించే దిశగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్రా వెంకమ్మ, కార్యదర్శి వి.స్రవంతి పాల్గొన్నారు.



కొల్లూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత మురళీకృష్ణ



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్ తదితరులు

ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

● జేసీ ప్రఖర్‌జైన్

చెరుకుపల్లి, సెప్టెంబరు 20: సంక్షేమ పథకాలను పేద ప్రజల ఇంటివద్దకు తెచ్చి అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. శుక్రవారం గుళ్ళపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఇది మంచి ప్రభుత్వం సభలో ఆయన మాట్లాడుతూ గ్రామసీమల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు పైర్లు దెబ్బతిన్న రైతుల ను గుర్తించి జాబితాలను తయారు చేశామన్నారు. పైరు దెబ్బతిన్న ప్రతి రైతుకు నష్టపరిహారాన్ని అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అలా గే మండలంలోని 15పంచాయతీలలో ఇది మంచి ప్రభుత్వం.. గ్రామసభలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో నాగలక్ష్మీ, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు ఎం.రాధాకృష్ణమూర్తి, పి.నాగేశ్వరరావు, వి.శ్రీనివాస్, వంగర చక్రవర్తి, మున్నా, పంచాయతీ కార్యదర్శులు ఈపూరి విజయబాబు, వి.మురళీకృష్ణ, మహేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం చేయటం అభినందనీయం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 20: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావటం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు సాయం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు బాపట్ల వీజీఆర్‌ఎం జూనియర్ కళాశాల యాజమాన్యం శుక్రవారం రూ.50,116 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, కళాశాల డైరెక్టర్‌లు అంబటి గిరిధర్, ఎ.విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యసంఘం చేయూత...

విజయవాడలోని సత్యనారాయణపురంలో పేద ఆర్యవైశ్య కుటుంబాలకు బాపట్లజిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు, లుంగీలు, చీరలు, పచ్చళ్ళు శుక్రవారం పంపిణీచేశారు. సంఘ కార్యదర్శి మద్దాలి సంజీవరావు, ఉపాధ్యక్షులు మద్ది సుబ్రహ్మణ్యం, సాతులూరి భావన్నారాయణ, జాయింట్ సెక్రటరి బైసాని కోదండరామప్రసాద్ ఆధ్వర్యంలో జె.పంగులూరు మండలాధ్యక్షులు కె.శివశేషారావు, కార్యదర్శి సోము నాగేశ్వరరావు, సామా సురేష్, డి.పుల్లారావు, పి.శ్రీనివాసరావులు కాలనీలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి కమిటీ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు.

సీపీఎస్ ఉద్యోగులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 20: గత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులపై మోపిన అక్రమకేసులు ఎత్తివేయాలని కోరుతూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు వినతిపత్రం అందించారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్లటూరు ప్రజావేదిక వద్ద ఏపీసీపీఎస్‌ఈఏ సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే ఆయా కేసులను రద్దు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కమిషనర్ నిర్మల్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 20: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ ఉద్యోగులు, శానిటరీ కార్మికులతో కలిసి 9,10 వార్డులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు జేసీబీలు, 5 ట్రాక్టర్‌లు, 60మంది పారిశుధ్య కార్మికులతో మెగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వార్డులలో వ్యర్థాలు తొలిగించి శుభ్రం చేశారు. రహదార్లు శుభ్రం చేసి తడి, పొడిచెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించి వాటిని వేర్వేరుగా సేకరించారు. బాపట్ల పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, సిబ్బంది, శానిటరీ కార్మికులు



ఉప్పూడి గ్రామ వాసి శ్రీధర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తున్న అనగాని శివప్రసాద్

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రేపల్లె, సెప్టెంబరు 20: వైద్యం చేయించుకోలేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన సుఖవాసి శ్రీధర్‌కు వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్‌కు వైద్య ఖర్చులకు రూ.47,342 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టిట్కోగృహాలను లబ్ధిదారులకు అందించాలి

రేపల్లె, సెప్టెంబరు 20: గత టీడీపీ ప్రభుత్వ హయాం లో టిట్కోగృహాలను పేద, మధ్యతరగతి కుటుంబాలకు కేటాయించారని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్ళలో వాటి నిర్మాణం చేపట్టలేదని పట్టణ ఆదర్శవేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు అన్నారు. ప్రస్తుత ఎన్డీ యే ప్రభుత్వం ఆయా గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాంబశివరావుకు పట్టణంలోని పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు పైపులు లీకవటం వల్ల కలుషిత నీరు వస్తున్నాయని కొత్త పైపులను ఏర్పాటుచేయాలని కోరారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీటి వసతి, రహదారులను నిర్మించాలన్నారు. పట్టణంలో ప్రధాన డ్రెయిన్‌ల పూడిక తీసి మురుగునీరు పారుదలయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎ.వెంకటేశ్వర్లు, నల్లూరు సాయికృష్ణమాచార్యులు, వై.సాంబశివరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమృతలూరు, సెప్టెంబరు 20: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీవో సుభానీ తెలిపారు. స్థానిక సమావేశపు హాలునందు ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంకు ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ అధ్యక్షత వహిస్తారన్నారు. మండలస్థాయి అధికారులు అందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ మోటార్ల మరమ్మతులకు సాయం అందించాలి

భట్టిప్రోలు(కొల్లూరు), సెప్టెంబరు 20: వరదనీటిలో మునిగిపోయిన వ్యవసాయ విద్యుత్‌మోటార్ల మరమ్మతులకు సాయమందించాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వి.వెంకట్రామయ్య ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు వినతిపత్రం అందించారు. శుక్రవారం వెల్లటూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేను వారు కలిసి వివరించారు. ఇసుకమేటలు తొలగించేందుకు ప్రభుత్వం రైతులకు చేయూతనివ్వాలని కోరారు. లంకగ్రామాల్లో శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు, ఓలేరు, రావిఅనంతరం గ్రామాల వద్ద చెక్ డ్యామ్ నిర్మించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ అధికారి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 20: మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని హౌసింగ్ పీడీ జె.ఎస్.ఆర్. కేవీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయాలలో శుక్రవారం సచివాలయం, మున్సిపల్, మెప్మాసిబ్బందితో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జగనన్న కాలనీలలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో పొలాలలో స్థలాలు ఇచ్చారు కాబట్టి వర్షాకాలం నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నీటిని బయటకు పంపించే ఏర్పాటుచేయటంపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. అదేవిధంగా రాకపోకలకు అనుకూలంగా రహదార్లు అభివృద్ధి పర్చేలా చూడాలన్నారు. కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ స్థలాల రిజిస్ట్రేషన్‌తోపాటు నిర్మాణాలు చేసుకునేవారికి బిల్లులు వచ్చేలా చూడాలన్నారు. ఇంటిపన్ను వసూళ్ళ విషయంపై సమీక్షించటం జరుగుతుందన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ కె.సాహితి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లలో భారీ వర్షం



వర్షంతో రోడ్డుపై నిలిచిన నీరు

బాపట్ల, సెప్టెంబరు 20: నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో శుక్రవారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. భారీవర్షంతో సాగునీరు లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఊరట కలిగింది. ఇటీవల కురిసిన భారీవర్షాలతో ముంపునకు గురైన పొలాలలో నీరు మొత్తం బయటకు తీసివేశారు. ప్రస్తుతం పైర్లు ఎండిపోతున్న దశలో ఈ వర్షంతో పొలాలలో నీరు నిలిచి పంటపై ఆశలు చిగురించాయని రైతులు పేర్కొంటున్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలలో గతంలో కురిసిన వర్షం నీరు బయటకు పంపించకముందే మరలా వర్షం కురవటంతో నీరు పెరిగింది. రోడ్లపై నీరు నిలిచింది. ఖాళీ స్థలాలలో మురుగునీటితో వర్షపునీరు కలిసి దుర్గంధం వెదజల్లుతున్నది. గత 20 రోజులుగా ఖాళీ స్థలాలలో, అక్రమ లేఅవుట్‌లలో నిలచిన వర్షపునీటిలో కనీసం అధికారులు ఆయిల్‌బాల్స్ కూడా వేయకపోవటంతో దోమలు, పురుగులు పెరిగిపోయి పట్టణ ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అంటు వ్యాధులు వ్యాపిస్తాయని మురికివాడల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇసుక తవ్వకాలు వద్దన్న ఎస్ఐతో టైరుబండ్ల యజమానుల వాగ్వాదం

● కొల్లూరులో ధర్నా చేస్తామంటూ బయలుదేరిన యజమానులు

● టీడీపీ నేత మురళీకృష్ణ చొరవతో సద్దుమణిగిన వివాదం

కొల్లూరు, సెప్టెంబరు 20: అరవిందవారధి వద్ద ఇసుక తవ్వకాలు వద్దన్న ఎస్ఐ ఏడుకొండలుతో టైరుబండ్ల యజమానులు వాగ్వాదానికి దిగారు. శుక్రవారం తెల్లవారుజామున కొల్లూరు మండలంలోని పెసర్లంక గ్రామానికి చెందిన ఎడ్లబండ్ల యజమానులు ఇసుక తవ్వుకునేందుకు అరవింద వారధి వద్దకు వెళుతుండగా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వారధి వద్దకు చేరుకుని ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవంటూ వారిని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా యజమానులు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. ఇసుక రవాణా ద్వారానే మాకు ఉపాధి అంటూ ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చేవరకు కొల్లూరులో ఎడ్లబండ్లతో ధర్నా, రాస్తారోకో చేస్తామంటూ టైరుబండ్ల యజమానులు వారధి వద్ద నుంచి సుమారు 60 ఎడ్లబండ్లతో బయలుదేరారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ ఎడ్లబండ్ల యజమానులు ఆందోళన విషయం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు తెలియజేశారు. ఎడ్లబండ్లపై ఇసుక రవాణా అనుమతులు విషయమై తాను ఎస్ఐతో చర్చిస్తానని ఆందోళన చేయకుండా వారిని వారించాలని ఎమ్మెల్యే సూచించడంతో వెంటనే కొల్లూరు లాకుల వద్దకు వెళ్లి టైరుబండ్ల యజమానులతో చర్చించి ఇసుకరవాణా చేసుకునేందుకు ఎడ్లబండ్లకు ఎమ్మెల్యే అనుమతులు ఇప్పిస్తారని చెప్పి ఆందోళన చేపట్టకుండా వారిని విరమింపజేశారు.



అరవింద వారధి వద్ద ఇసుక తవ్వకాలను అడ్డుకున్న ఎస్ఐతో వాగ్వాదానికి దిగిన టైరు బండ్ల యజమానులు

యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యుడిగా బొమ్మన సాంబయ్య

కర్లపాలెం, సెప్టెంబరు 20: బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల యాంటీర్యాగింగ్ కమిటీ సభ్యులుగా 2024-2025 సంవత్సరానికి పెదగొల్లపాలెం మాజీ సర్పంచ్ బొమ్మనబోయిన సాంబయ్య నియమితులయ్యారు. సాంబయ్యను వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ డి.స్మిత్‌ను నియమించారు. సాంబయ్య నియామకం పట్ల మండలంలోని పలువురు అభినందనలు తెలిపారు. వారిలో తిమ్మరాజు వెంకటసుబ్బారావు, పెదమల్లు రంగారావు, పమిడి భాస్కరరావు, పెనుమెత్స సత్యనారాయణరాజు, పెనుమెత్స కృష్ణంరాజు, మాడా శ్రీనివాసరావు, నందనవనం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే 81 మందిపై కేసు

బాపట్ల,సెప్టెంబరు 20: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే ఉపేక్షించేది లేదని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తీసుకునేందుకు ఏకకాలంలో జిల్లావ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 81మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. బహిరంగప్రదేశాలలో మద్యం తాగటం చట్ట విరుద్ధమన్నారు. కేసులు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడులు తరచుగా జరుగుతాయన్నారు. దాబాలు, ఫ్యామిలీ రెస్టారెంట్‌లు, హోటళ్ళు ఇతర అనుమతి లేని ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని, నిర్వాహకులపై కూడా కేసులునమోదు చేస్తామన్నారు. పోలీసులు గస్తీ నిర్వహిస్తూ బహిరంగ ప్రదేశాలపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం ఉంటే పోలీసులకు 100, 112 నెంబర్లకు తెలపాలన్నారు.

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

బాపట్ల, సెప్టెంబరు 20: మండల స్థాయి బాలబాలికల ఆటల పోటీలు శుక్రవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎంఈవో ఎస్.నిరంజన్ ప్రారంభించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీలలో అథ్లెటిక్స్, రన్నింగ్, షార్ట్‌పుట్, డిస్కస్, జావలిన్, లాంగ్ జంప్, హైజంప్ రెండు కేటగిరీలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, హెచ్ఎం బి.రాజశ్రీ, పీడీలు కత్తి శ్రీనివాసరావు, ఎన్‌టీ రాంబాబు, వివిధ మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏబీఎం ఆస్తులను కాపాడాలని వినతి

బాపట్ల, సెప్టెంబరు 20: బాపట్ల పట్టణంలోని ఏబీఎం ఆస్తులను కాపాడాలంటూ కస్టోడియన్ ఇనగలూరి మాల్యాద్రి సభ్యులతో కలిసి శుక్రవారం పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీకి వినతిపత్రం అందజేశారు. సీఐకి తమ సమస్యలను వివరించారు. మిషనరీ ఆస్తులను కొంతమంది అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని విద్యాసంస్థలకు ఆటంకం కలిగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పెరుమాళ్ళ శాంత ఆనందకుమారన్, గుత్తి దేవసహాయం, సందిపోగు నిరంజన్, జిన్నిపోగు నెహేమియా తదితరులు ఉన్నారు.

పేదల ఆర్థిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బాపట్ల, సెప్టెంబరు 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదప్రజల ఆర్థిక సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని 24వవార్డు డ్రైవర్స్‌కాలనీలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ప్రసాద్ మాట్లాడుతూ గత పాలకులు అనుసరించిన విధానాల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంత పేదల ఉపాధిరంగం తీవ్ర సంక్షోభంలోనికి నెట్టబడిందన్నారు. రైతులు, కౌలురైతులు అప్పులు నుంచి బయటపడే మార్గంలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వాలు దీనిపై దృష్టిపెట్టి పేదలకు మేలు జరిగేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు జె.కల్పన, కొండా అన్నమ్మ, గోనేపల్లి వెంకట్రావు, పి.లక్ష్మీ, కాటి మేరి తదితరులు పాల్గొన్నారు.

జీవో 85ను రద్దు చేయాలి

బాపట్ల, సెప్టెంబరు 20: జీవో 85ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ విషయమై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘనాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంతో జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ, డాక్టర్ కిరణ్, డాక్టర్ జాన్‌ప్రసాద్, డాక్టర్ శైలాభాను, డాక్టర్ అనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన స్వభావ స్వచ్ఛత సేవా కార్యక్రమం

బాపట్ల,సెప్టెంబరు 20: పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యానవనంలో స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలోని ఉద్యానవనంలో నాల్గవ రోజు సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యానవనం శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను సేకరించి గడ్డిమొక్కలను తొలిగించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ విమల బీర, డాక్టర్ బ్లెస్సీసాగర్, పీఈటీ డాక్టర్ ఫణేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగభృతికి వేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల,సెప్టెంబరు 20: రాష్ట్రంలో వేద విద్యనభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వేదపండితులకు నిరద్యోగ భృతి చెల్లించటం జరుగుతుందని బాపట్ల జిల్లా దేవదాయ, ధర్మాదాయశాఖాధికారి ఎం.పానకాలరావు తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ బాపట్ల దేవదాయశాఖ కార్యాలయంలో వారు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై ఫోక్సో కేసు

బాపట్ల, సెప్టెంబరు 20: పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని పాఠశాలకు వస్తుండగా దగ్గుమల్లివారిపాలెంకు చెందిన మిక్కిలి చినబాబు బలవంతంగా బైక్‌పై తీసుకెళ్ళినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలికను చీరాల తీసుకెళ్ళగా అక్కడ బాలిక తప్పించుకుని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కుటుంబసభ్యులు చీరాల వెళ్ళి బాలికను తీసుకొచ్చి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


సాంబయ్య (ఫైల్)

ఇంకొల్లు, సెప్టెంబరు 20 : శనగలు అమ్మేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఇంకొల్లులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వలేటి సాంబయ్య(72) గురువారం సాయంత్రం ఇంకొల్లులోని కొణికి రోడ్డులో ఉన్న శీతలగిడ్డంగిలో ఆయన నిల్వ ఉంచిన శనగలు అమ్మేందుకు వెళ్లాడు. అక్కడ నుంచి తమ స్నేహితుడి మోటర్‌సైకిల్‌పై తిరిగి ఇంకొల్లు వస్తుండగా పాతమద్రాసు రోడ్డులో డాల్ఫిన్ రెస్టారెంట్ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించే ప్రయత్నంలో గేదెలకు ఢీ కొన్నారు.దీంతో మోటర్‌సైకిల్ అదుపుతప్పి కిందపడటంతో వెనుక కూర్చొని కిందపడిన సాంబయ్య మీదు నుంచి గేదెలు తొక్కుకుంటూ వెళ్లాయి. దీంతో ఆయనకు బలమైన గాయాలు కావడంతో ప్రయివేటు అంబులెన్స్‌లో ఒంగోలు ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున సాంబయ్య మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. మోటర్‌సైకిల్ నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో గంగవరంలో విషాదచాయలు అలముకున్నాయి. ఆయన మృతదేహాన్ని మండలంలోని పలువురు ప్రముఖులు సందర్శించి సంతాపం తెలిపారు. రైతుకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

చీరాల ఎస్టీవో కార్యాలయ ప్రక్షాళన

నూతన ఎస్టీవోగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 20 : చీరాల ఉపఖజానా కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు అందిన నివేదిక ఆధారంగా ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, డీటీవో శివకామేశ్వరిలు అందజేసిన విచారణ నివేదిక ఆధారంగా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అకౌంట్స్ ఎన్. మోహనరావుకు కార్యాలయ అధికారులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకట మురళి సిఫార్సు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం బాపట్ల డీటీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎంవీ సుబ్బారావును చీరాల ఎస్టీవో(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ఎస్టీవోగా పనిచేసిన భాగ్యలక్ష్మిని , సీనియర్ అకౌంటెంట్ సుధీరాలను సస్పెండ్ చేశారు. కార్యాలయంలో మిగిలిన ఆరుగురిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సంబంధీకులకు డీటీవో శివకామేశ్వరి అందజేశారు. నూతన డీటీవో సుబ్బారావుకు నియామక ఉత్తర్వులు అందజేశారు. మధ్యాహ్నం వరకు డీటీవో చీరాల కార్యాలయంలో ఉండి పర్యవేక్షించారు. అనంతరం ఎస్టీవో భాగ్యలక్ష్మి నుంచి నూతన ఎస్టీవో సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. ఇద్దరిని సస్పెండ్ చేయగా మిగిలిన ఆరుగురిలో గిద్దలూరుకు ఒకరు, నెల్లూరుకు ఇద్దరు, ఒంగోలుకు ఒకరు, దర్శికి ఒకరు, కనిగిరికి ఒకరు బదిలీ కాగా వారికి ఎస్టీవో సుబ్బారావు రిలీవింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. వారి స్థానంలో కొత్తగా నియమితులైన వారిలో ముగ్గురు విధుల్లో చేరారు. కనిగిరి నుంచి ఇద్దరు, మార్కాపురం నుంచి ఒకరు, దర్శి నుంచి ఒకరు కొత్తవారు విధుల్లో చేరాల్సి ఉంది. వీరు శనివారం జాయినింగ్ ఆర్డర్లతో విధుల్లో చేరే అవకాశం ఉందని ఎస్టీవో సుబ్బారావు తెలిపారు. మొత్తం మీద ఎస్టీవో కార్యాలయం ప్రక్షాళనపై ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలపై ఇతర శాఖల్లోనూ చర్చ జరుగుతోంది.

250 కుటుంబాలకు దుస్తుల పంపిణీ

మేదరమెట్ల, సెప్టెంబరు 20 : ఇటీవల విజయవాడలో వరదలతో ఇబ్బంది పడిన ప్రజలకు కొరిశపాడు, జె. పంగులూరు మండలాల ఆర్యవైశ్య నాయకులు దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం విజయవాడలోని హెచ్‌బీ కాలనీలోని వాసవి కన్యకపరమేశ్వరి అమ్మవారి కమిటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, లుంగీలు, చీరలు, ఊరగాయ పచ్చళ్లను పంపిణీ చేసినట్లు బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మద్దాళి సంజీవరావు తెలిపారు. వరద బాధితులకు తమవంతుగా సాయం చేయాలనే ఆలోచనతో వారికి ఉపయోగపడే విధంగా దుప్పట్లు చీరలు, లుంగీలు తినడానికి ఊరగాయ పచ్చళ్లను అందజేసినట్లు సంజీవరావు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది సుబ్రహ్మణ్యం, సాతులూరి భావన్నారాయణ, సంయుక్త కార్యదర్శి బైసాని కోదండ రామప్రసాద్, కొరిశపాడు మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు దేసు పుల్లారావు, జె. పంగులూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కే. శివశేషరావు, కార్యదర్శి సోము నాగేశ్వరరావు, సామా సురేష్, బేరకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంచి నడవడికతో చదివి పేరు తేవాలి


మైక్‌సెట్‌ను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి నడవడికతో బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్తు పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సంవత్సరం పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందిస్తామని ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం ఊటుకూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వందరోజులలో పలు అభివృద్ధి పనులు

ఎంపీడీవో రామాంజనేయులు


వంద రోజులలో చేపట్టిన పనులను వివరిస్తున్న అధికారులు,సిబ్బంది

పంగులూరు, సెప్టెంబరు 20 :వంద రోజుల పాలనలో నూతన ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి మంచి ప్రభుత్వంగా ప్రజా మన్ననలు పొందిందని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. మండలంలోని జనకవరం గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. పించన్ పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, డీఎస్సీ ద్వారా టీచర్ల నియామక ప్రక్రియ, అన్న క్యాంటీన్ల ప్రారంభంతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల బ్రోచర్లను అందచేసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈవోఆర్డీ రామ్‌కుమార్, ఎంఈవో వీరాంజనేయులు, రాంబాబు, కార్యదర్శి సుకన్య, సుబ్బారావు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షునిగా కరణం వెంకటేష్ ...?

చీరాల, సెప్టెంబరు 20 : వైసీపీ జిల్లా అధ్యక్షునిగా ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను నియమించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్మోహనరెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. శుక్రవారం తాడేపల్లిలోని కార్యాలయంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని బాధ్యులతో జగన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్‌ను బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షునిగా పనిచేయాలని అడిగినట్లు సమాచారం. అయితే వెంకటేష్ అప్పటికప్పుడు ఏ నిర్ణయం తెలపనట్లు తెలిసింది. తరువాత ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తితో సజ్జల రామకృష్ణారెడ్డి, అయోధ్య రామిరెడ్డిలు ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. సమావేశానికి జిల్లాలోని అద్దంకి, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల ఇన్‌చార్జులు పాణెం హనిమిరెడ్డి, గణేష్, మేరుగ నాగార్జునలు హాజరయ్యారు. పర్చూరు, బాపట్ల నియోజకవర్గాల ఇన్‌చార్జులు యడం బాలాజీ, కోన రఘుపతిలు అమెరికాలో ఉండటంతో వారు హాజరుకాలేదని తెలిసింది.

జనంతో మమేకం

దగాపడ్డ కుటుంబాలకు చేయూత

నిశిత పరిశీలన.. నిర్దిష్ట చర్యలు

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంను

ప్రజల కోసమే వినియోగించిన చంద్రబాబు


బజారులో నడుచుకుంటూ వెళ్తున్న సీఎం చంద్రబాబు, కలెక్టర్ అన్సారియా

కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అంటూ చేపట్టిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగాపడ్డ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు చేయూతనిచ్చే విధంగా నిర్వహించారు. ఎలాంటి హడావుడి లేకుండా గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని వెంటనే పరిష్కారం చూపారు. హంగు ఆర్భాటాలకు పోకుండా పేదల ఇళ్లకు వెళ్లటం, వారితో మాట్లాడటం చూస్తే ప్రజాపాలన అంటే ఇది కదా అని జనం చర్చించుకోవడం విశేషం. కాగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజల కోసం వినియోగించి అందని మన్ననలు బాబు పొందగలిగారు. నాగులుప్పలపాడు మండలం, మద్దిరాలపాడు గ్రామంలో శుక్రవారం ఆయన నిర్వహించిన ఈ కారార్యక్రమం అందుకు అద్దం పట్టింది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా ఆరు రోజులు గ్రామాలకు వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అందులోభాగంగా ఆయన తొలిరోజు కార్యక్రమాన్ని మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహించి ప్రభుత్వం ప్రజాసేవకే పరిమితమన్న సంకేతాన్ని ఇవ్వగలిగారు. రమారమీ రెండున్నర గంటల పాటు ఆయన ఆ గ్రామంలో గడిపారు. ఊకదంపుడు ఉపన్యాసాలకు పరిమితం కాకుండా ప్రజలతో మమేకమయ్యారు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా వచ్చినప్పుడు అధికారులు, పోలీసులు చేసే హడావుడి, ఆర్భాటాలు ఈ కార్యక్రమంలో మచ్చుకు కూడా కనిపించలేదు. గ్రామంలోని కొన్ని గృహాలకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవటంతో పాటు గ్రామసభలో కూడా ప్రజలను పిలిచి మాట్లాడించి వారు చెప్పే పొగడ్తలకు పొంగిపోకుండా వారు వినిపించిన సమస్యలపై సానుకూలంగా స్పందించటం అప్పటికప్పుడు కొన్ని ప్రజోపకర నిర్ణయాలు తీసుకోవటం విశేషం.

పేద కుటుంబాలకు చేయూత

మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో హెలికాప్టర్‌లో వచ్చిన చంద్రబాబు వెంటనే మద్దిరాలపాడు గ్రామంలోకి ప్రవేశించారు. గ్రామంలో నేరుగా సభలోకి వెళ్లకుండా కొందరు ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా రెండు కుటుంబాల వారు చెప్పిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ప్రత్యేకించి ఒక కుటుంబం వారు గత ప్రభుత్వంలో దగాపడిన విషయం గుర్తించి అప్పటికప్పుడు ప్రభుత్వపరంగా వారికి అందాల్సిన ఆర్థిక సహకారాన్ని కూడా అందించే ఏర్పాటు చేశారు. తొలుత ఆయన ముస్లింల ఇంటికి వెళ్లారు. ఇంటిలోని గృహిణి షేక్ బీబీసార తాను కూలీ పనులకు వెళ్తానని, తన భర్త బేల్దారీ పనులకు వెళ్తాడని చెప్పింది. వెంటనే చంద్రబాబు వారి పిల్లల గురించి వాకబు చేశారు. వారి కుమార్తె రజియాబేగం 10వ తరగతి వరకు చదువుకుందని, ఆర్థిక స్తోమత లేక చదువు ఆపేసి తనతో కూలీ పనులకు తీసుకెళ్తున్నట్లు తెలిపింది. వారి కుమారుడు కరిముల్లా 9వ తరగతి వరకు చదువుకున్నాడని, అతను చదువు ఆపించి మెకానిక్‌గా పనికి పంపుతున్నట్లు వివరించింది. ఆశ్చర్యపోయిన చంద్రబాబు పిల్లల్ని మీకు చదువుకునే ఉద్దేశం లేదా అని ప్రశ్నించగా వారు చదువుకోవాలనే ఆసక్తి చంపుకొని కూలి పనులకు వెళ్తున్న విషయాన్ని తేల్చారు. ఎందుకు వారిని చదివించటం లేదని అడగ్గా బీబీసార గతంలో టీడీపీ ప్రభుత్వంలో 2017-18లో తమకు ఇళ్ల మంజూరు చేశారని తెలిపారు. వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టామని మీరు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బుల్లో రెండు బిల్లులు ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో తమకు ఒక్క రూపాయి కూడా రాలేదని, ఆ ఇంటి కోసం అప్పు చేయాల్సి వచ్చిందని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబాన్ని ఈదుకుంటూ అప్పు తీర్చుకునేందుకు పిల్లలను కూలీ పనులకు పంపక తప్పలేదని వివరించారు. తర్వాత ఆమెను గ్రామసభకు పిలిపించారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఇంకా వారికి రావాల్సిన రూ.65,150లను వెంటనే ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ రోజే ఆ డబ్బులకు సంబంధించిన చెక్ ఇవ్వాలని స్పష్టంగా ఆదేశించారు. అలాగే వారి పిల్లలిద్దరినీ చదివించే బాధ్యత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వెంటనే వారిని పాఠశాలలో చేర్చాలని ఆదేశించారు. వారి పాప రజియాబేగం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకోవాలనుకుంటే అవసరమైన ఏర్పాటు చేయాలని సభలో ఉన్న విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్‌కు సూచించారు. ఆ తర్వాత బీబీసార మైక్ తీసుకొని సీఎం ఇచ్చిన చేయూతకు హర్షం వ్యక్తం చేస్తూ కన్నీటిపర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి రావాల్సిన నిధులు ఆగిపోగా మళ్లీ మీరు వస్తే మా కల నెరవేరుతుందని ఆశించామన్నారు. తమ కల మరింత స్థాయిలో నిజం కావటంతో మాటలు రావటం లేదని మీకు రుణపడి ఉంటామని మళ్లీమళ్లీ మీరే సీఎం కావాలంటూ కన్నీరు పెట్టుకుంటూ మాట్లాడారు.

వెంటనే అందరికీ ఇళ్లు మంజూరు

బీబీసార ఇంటి తర్వాత ముఖ్యమంత్రి కల్లుగీత కార్మికుడు ఆలుదాసు శ్రీను ఇంటికి వెళ్లారు. నిరుపేద అయిన తమకు అన్నీ అర్హతలు ఉన్నా గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేయలేదని చెప్పారు. అందరి చుట్టూ తిరిగినా పని జరగలేదని వివరించారు. పైగా తాము వాళ్ల పార్టీ కాదనే నెపం పెట్టి పక్కన పెట్టారని చెప్పారు. వాళ్లకు వెంటనే ఇంటిని మంజూరుచేయటంతోపాటు కొత్త మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేసే మద్యం దుకాణంలో ఒకటి వారికి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఇళ్లులేని వారు సుమారు 200 కుటుంబాలు ఉన్నాయనే అధికారుల నివేదిక పరిశీలించి అందరికి ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

వెంటనే ట్రై సైకిల్ ఇవ్వండి

గ్రామసభలో ఎదురుగా ప్రజల్లో ఉన్న ఒక దివ్యాంగుడిని చూసి అతడి సమస్యలు అగిగారు. ఆయన ట్రై సైకిల్ కూడా లేని విషయాన్ని చెప్పగానే వెంటనే ట్రైసైకిల్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు దివ్యాంగుడినైనప్పటికీ పింఛన్ రాని విషయంను సీఎం దృష్టికి తీసుకెళ్లగా నిబంధలకు అనుగుణంగా వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. ఆ సందర్భంగా ఆయన ప్రభుత్వ డాక్టర్లను హెచ్చరిస్తూ గతంలో తప్పుడు సదరమ్ సర్టిఫికెట్లు ఇచ్చిన విషయం బయటకు వచ్చిందని, భవిష్యత్తులో అలాంటి పనులు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్పంచ్ ఆవేదన.. బాబు స్పందన

గ్రామ సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ స్వర్ణ అనురాధ మాట్లాడుతూ తాను ఎంసీఏ చదువుకున్నానని, గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో అనేక ప్రయత్నాలు చేశానన్నారు. విద్యుత్ సమస్యపై , తాగునీటి సమస్యపై సంబంధిత అధికారుల చుట్టూ తిరిగానని వివరించారు. ఎవ్వరూ సానుకూలంగా స్పందించకపోగా తాను తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచ్‌నంటూ తన ప్రతిపాదనలు తోసిపుచ్చారని భావోద్వేగంతో వివరించారు. ఈ ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే తాను పదవిలో ఉండి వ్యర్థం అన్నట్లు మాట్లాడారు. దీనిపై స్పందించిన సీఎం మీరు నిరాశ పడకండి మన ప్రభుత్వం అంతా మంచే చేస్తుంది. ఇది మంచి ప్రభుత్వం అంటూ అనేక గ్రామ సమస్యల పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. సర్పంచ్ అనురాధ మరింత ఉత్సాహంగా పనిచేసే విధంగా ప్రోత్సహించి సభికుల మన్ననలు అందుకున్నారు.

హంగూ ఆర్భాటం లేకుండా..

గ్రామంలో హంగూ ఆర్భాటాలు లేకుండా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటనలో సందర్భంగా గాని గ్రామసభ సందర్భంగా గాని పోలీసుల అడ్డంకులు, నాయకులు, ప్రజాప్రతినిదుల ఆర్భాటాలు కనిపించలేదు. అధికారులు ఎంపిక చేసిన వారి ప్రసంగాలకే పరిమితం కాకుండా సభలోని కొందరిని పిలిచి మాట్లాడించి మా ప్రభుత్వం మీకోసం ఉంది. నిర్భయంగా ముందుకు వచ్చి పనులు చేయించుకోండి అంటూ కార్యక్రమాన్ని నిర్వహించి యావత్తు గ్రామ ప్రజల మన్ననలు పొందగలిగారు.

ముఖ్యమంత్రి పర్యటన మూడు గంటలు

స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు


చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు వేచిచూస్తున్న నేతలు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 20: మద్దిరాలపాడులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు గంటల పాటు పాల్గొన్నారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడలో సాయివిష్ణు విల్లాస్ చతుర్వాటికలో హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డి.బాలవీరాంజనేయస్వామి, ఎంపీలు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బీఎన్.విజయకుమార్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆశోక్‌రెడ్డి, ఎం.ఎం.కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, నాయకులు దామచర్ల సత్య, గరటయ్య, నూకసాని బాలాజీ, కలెక్టర్ తమీమ్ అన్సారీ, గుంటూరు రేంజి ఐజీ సర్వశేష్టి త్రిపాఠి, ఎస్పీ ఆర్.దామోదర్ తదితర నాయకులు ఘన స్వాగతం పలికారు. 2.32 నిమిషాలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగి సభాస్థలికి ప్రత్యేక బస్సులో బయలుదేరారు. ఆయన వెంట ప్రధాన కార్యాదర్శి నీరబ్‌కుమార్ ఉన్నారు. గ్రామంలో మూడు కుటుంబాల వారితో ముఖాముఖి మాట్లాడి ప్రభుత్వ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. మద్దిరాలపాడులో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించి తిరిగి హెలిప్యాడ్ వద్దకు 5.30కు వచ్చి మంగళగిరి తిరిగి వెళ్లారు. మూడు గంటల పాటు మద్దిరాలపాడులో ప్రజలతో మాట్లాడటంతో పాటు సభలో ప్రజల ప్రభుత్వ పని విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే బీఎస్.విజయ కుమార్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

పంచాయతీలు బలంగా ఉంటేనే అభివృద్ధి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మిన్నేకల్లులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

సంతమాగులూరు, సెప్టెంబరు 20: పంచాయతీలు బలంగా ఉంటేనే అభివృద్ధి చెందుతాయని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగాయి. సంతమాగులూరు మండలం మిన్నేకల్లు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె. వెంకట మురళి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రజల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. వినతి పత్రాల ద్వారా కొందరు తమ సమస్యలను విన్నవించగా, మరి కొందరు స్వయంగా విన్నవించడంతో తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తోందని తెలిపారు. వందరోజుల పాలన దిగ్విజయంగా ముగించుకుని అభివృద్ధివైపు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని, ప్రజలకు ఉపయోగపడే పనులను మాత్రమే ప్రభుత్వం చేపడుతుందని స్పష్టం చేశారు. ప్రజలలోకి వెళ్లాలి, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాలు వారం రోజులు పాటు జరుగుతాయన్నారు. అధికారంలోకి రాగానే పించన్ సొమ్ము మూడు నుంచి రూ.నాలుగు వేలకు పెంచడం, దివ్యాంగులకైతే రెండింతలు చేసి రూ.6,000లు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. భూములకు భద్రతలేక, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. వంద రోజుల్లోనే 16,437 డీఎస్సీ పోస్టుల విడుదల చేశాం, అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామన్నారు. కేవలం ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ల ద్వారా టిఫిను, భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, ప్రజలకు ఉపయోగపడే పనులనే ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని చెప్పారు. వరద విపత్తు సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి 10 రోజులు బస్సులోనే ఉండి ప్రజలకు సహాయక చర్యలు అందేలా చూశారన్నారు. మిన్నేకల్లు గ్రామానికి రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద రహదారులు, మురికి కాల్వలు నిర్మిస్తామన్నారు. అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని, రాజీ పడరాదని సూచించారు. కలెక్టర్ జె వెంకటమురళి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలో ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నదన్నారు. బాపట్ల జిల్లాలో 30 వేల మంది నిరాశ్రయులైతే సహాయక చర్యలు అందించడంలో వెనుకాడలేదన్నారు. ఎలాంటి ప్రాణహాని లేకుండా, అంటు వ్యాధులు ప్రబలకుండా 24 గ్రామాలకు తక్షణమే విద్యుత్ ఇచ్చామన్నారు. ఐదు గంటల్లోనే తాత్కాలిక రహదారులను పునరుద్ధరించామన్నారు. ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పరిపాలనలో నిమగ్నమయిందని చెప్పారు. అద్దంకి నియోజకవర్గ ప్రజల కోసం ప్రతి సోమవారం ఒక మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీదేవి, మండల ప్రత్యేక అధికారి రమేష్ బాబు, ఎంపీపీ యలమంద, సర్పంచ్ ఎం. గోవిందమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాగడానికి ఇబ్బందికరంగా గుండ్లకమ్మ జలాలు


రంగుమారి వస్తున్న గుండ్లకమ్మ జలాలు

మేదరమెట్ల, సెప్టెంబరు 20: మేదరమెట్లలలోని తాగునీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరు వాడుకోవడానికి కూడా అవకాశం లేనంతగా రంగుమారి వస్తున్నాయి. ఇటీవల ఈ పథకం ద్వారా వస్తున్న నీటిపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో గేట్లు కొట్టుకుపోవడంతో రిజర్వాయర్‌లో నీరు పూర్తిగా అడుగంటింది. తాగునీటి పథకాలకు కూడా నీరు అందకపోవడంతో కొద్ది రోజులు నీటి సరఫరాను కూడా నిలిపి వేశారు. ఇటీవల కురిసిన వర్షాల వలన రిజర్వాయర్‌లోకి నీరువచ్చి చేరింది. మేదరమెట్లలోని తాగునీటి పథకం వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, క్లోరినేషన్ చేయకపోవడం వలన గుండ్లకమ్మ నీటిపై పలు గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ తాగునీటి పథకం కింద 20గ్రామాలకు పైగా నీటి సరఫరా జరుగుతోంది. అసలే దగ్గు , జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తాగునీరు ఈ విధంగా రావడంతో ఇంకేమి వ్యాధులు వస్తాయోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీటిని పూర్తిగా వడకట్టడం, క్లోరినేషన్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశ్రమలకు సకాలంలో రుణాలు అందిస్తాం

బ్యాంకు ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్


మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి

బల్లికురవ, సెప్టెంబరు 20 : అన్ని పరిశ్రమలకు సకాలంలో రుణాలు అందించి కార్మికులకు ఉపాధి మెరుగు పడేలా తమ వంతు చేయూత అందిస్తామని గుంటూరు బ్యాంకు అఫ్ బరోడా రీజినల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేమవరం గ్రామం వద్ద గల గ్రానైట్ ఫ్యాక్టరీలో గ్రానైట్ యజమానుల సంఘం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య అధ్యక్షతన బ్యాంకు అఫ్ బరోడా ఆధ్వర్యంలో పరిశ్రమల యజమానులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌ఎం మాట్లాడుతు పరిశ్రమలను ఏర్పాటు చేసిన, కొత్తగా నిర్మాణంలో ఉన్న యజమానులు తమ బ్యాంకును సంప్రదించాలని, వారికి రుణాలపై ప్రత్యేక రాయితీలు ఇస్తామని అన్నారు. అనంతరం యజమానులు ఆర్‌ఎంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ క్రెడిట్ హెడ్ ప్రదీప్, ఒంగోలు చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం,కిషోర్, స్థానిక మేనేజర్ ధనపాల్, పలు గ్రామాలకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు న్యాయవాదులు విరాళం

- రూ.30వేల చెక్కును ఎమ్మెల్యే కొండయ్యకు అందజేత


ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కు అందజేస్తున్న న్యాయవాదులు

చీరాల, సెప్టెంబరు 20 : గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో కొండయ్య, మరో 11 మందిపై వైసీపీ ప్రభుత్వ హయాంలో కేసు నమోదయ్యింది. ఆ కేసుకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య తదితరులు కోర్టుకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు న్యాయవాదులు వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.30వేలు చెక్కును ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటివారిని ఆదుకునేందుకు న్యాయవాదులు ముందుకు రావటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు 20: వైసీపీ శ్రేణులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు. అద్దంకి మండలంలోని ధర్మవరంలో ఈ నెల 13వ తేదీ టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా వైసీపీ శ్రేణులు విద్యుత్ సరఫరా నిలిపి వేసి రాళ్లు, కర్రలతో దాడిచేయడంతో 12 మంది టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యేగేశ్వరరావు, సుబ్బారావు, దేవదాసు, శ్రీను, లక్ష్మీనారాయణలను శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు పథకం ప్రకారం మాటువేసి మూకుమ్మడిగా దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. వైసీపీ శ్రేణుల దాడిలో ఒక టీడీపీ కార్యకర్త కన్ను పోగొట్టుకున్నారన్నారు. గతంలో నియోజకవర్గంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గ్రామాలల్లో అభివృద్ధి బాటలో నడిపించామన్నారు. వైసీపీ శ్రేణులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన టీడీపీ కార్యకర్తలు పూర్తి సంయమనం పాటించాలన్నారు. ధర్మవరంలో వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు, బాధితులకు పూర్తిగా అండగా ఉంటానన్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు కరి పరమేష్, చాగంటి రాజేంద్ర తదితరులు ఉన్నారు.



పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకటకృష్ణ

వరిలో జింకు లోపం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: వరిలో జింక్ లోపం ఉన్నప్పుడు ఆకులు తుప్పు రంగులో మారతాయిని దీంతో మొక్క ఎదుగుదల ఆగిపోతుందని, ఎన్ని ఎరువులు వేసినా మొక్క తీసుకోలేదని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని కలవకూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా వరి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వరిలో జింకు లోపాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఏవో మాట్లాడుతూ వరిలో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించుకోవాలన్నారు. జింక్ లోపం నివారణ కోసం చిలేటెడ్ జింక్ 100 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్ రావు, రైతులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కష్టజీవుల గొంతుక ఏచూరి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

చీరాలటౌన్, సెప్టెంబర్ 20 : కష్టజీవుల శ్రమలను గుర్తెరిగి సమస్యల పోరాటానికై గొంతుక వినిపించిన మహనీయుడు సీతారాం ఏచూరి అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు విజయభాస్కర్ అధ్యక్షతన ఏచూరి సంతాప సభ జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు ముందుగా ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశనుంచే రాజకీయ రంగప్రవేశం చేసి సేవలు అందించినట్లు వివరించారు. ఎస్ఎఫ్ఐ నేతగా పరిచయమై రైతులు, కార్మిక, కష్టజీవుల కోసం అలుపెరగని పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. అటువంటి మహనీయుడి మరణం సామాన్యులకు తీరని లోటని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, ఎన్ బాబురావు, నారపరెడ్డి, కుర్రా రామారావు, ఏడుకొండలు, మస్తాన్‌రావు, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



కొణిదెనలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమేష్ పాఠశాల స్థల దాత రాధాకృష్ణమూర్తి

క్రీడలతో మానసికోల్లాసం

బల్లికురవ. సెప్టెంబరు 20 : రోజూ ఆటలు ఆడటం వలన విద్యార్థులలో మానసిక ఉల్లాసం మెరుగు పడుతుందని ఎంఈవో రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొణిదెన యజ్ఞనారాయణ మెమెరియల్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలు పోటీలు జరిగాయి. ఈపోటీల్లో ఎనిమిది పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఎంఈవో రమేష్, పాఠశాల స్థల దాత కొణిదెన రాధా కృష్ణమూర్తిలు ప్రారంభించారు. విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేబీ వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్, దేవిరెడ్డి సాయికుమారి, పోటీల కోఆర్డినేటర్ బొప్పూడి శ్రీనివాసులు, వ్యాయమ ఉపాధ్యాయులు నాగార్జున, అరుణ, విజయలక్ష్మి, మురళి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న పాలనలో రాష్ట్రానికి మంచిరోజులు

భారీగా నిధులతో పంచాయతీలకు మహర్దశ

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని ప్రజలు భావిస్తున్నారని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు.మండలంలోని జొన్నతాళి గ్రామ సచివాలయం వద్దశుక్రవారం జరిగిన ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో ఏలూరి పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నితిన్ అధ్యక్షత వహించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్వీర్యం చేసిన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం భారీగా నిధులతో మహర్దశ కల్పించిందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో గ్రామ పంచాయతీలకు భారీగా నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే 13,326 గ్రామ పంచాయతీలలో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించి 4500 కోట్ల రూపాయల విలువైన ఉపాధిహామీ పనులకు తీర్మానం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గత వైసీపీ పాలనలో కక్ష పూరిత రాజకీయాలు కొనసాగాయన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబును అకారణంగా 54 రోజులు జైలులో పెట్టినపుడే వైసీపీ ప్రభుత్వం పతనం మొదలయ్యిందన్నారు.ప్రజా సేవలో పోలీస్ స్టేషనం, కేసులకు దూరంగా ఉండే తనపై అక్రమంగా కేసులు పెట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళా ఖాతంలో కలిపేశారన్నారు.విజయవాడలో వరదలు సంభవించిన సమయంలో ప్రజలను స్వయంగా దగ్గరుండి ఆదుకున్న చంద్రబాబు,కూటమి ప్రభుత్వ మంత్రులు చేసిన సేవా కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

తరువాత గ్రామంలో పలు సీసీ రోడ్లు, సైడు కాల్వలు నిర్మాణానికి ఏలూరి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సివిల్ సప్లయి డీఎం చంద్రశేఖర్,తహసీల్దారు ప్రశాంతి,సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ,శానంపూడి చైతన్య, శివరాత్రి శ్రీను, గుండవరపు వెంకట ప్రసాద్, తాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జొన్నతాళిలో జరిగిన ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అభివృద్ధి, సంక్షేమం ప్రజా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 20: అభివృద్ధి, సంక్షేమం ప్రజా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండలంలోని చెరుకూరు గ్రామంలో ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేసే విధంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొసనా సత్యన్నారాయణ, ప్రజా కూటమి నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీర్చే ప్రభుత్వం మనది

- ఎమ్మెల్యే కొండయ్య



మరియమ్మపేటలో ఇంటింటి తిరుగుతూ ఇది మంచిప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య తదితరులు

చీరాల, సెప్టెంబరు 20 : పేదల కష్టాలు తీర్చే ప్రజా ప్రభుత్వం ఇదని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. కూటమి పాలన 100 రోజుల పూర్తయిన నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నియోజకవర్గంలో ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు మరియమ్మపేటలో ఎమ్మెల్యే కొండయ్య నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులను పెన్షన్లు ఎలా అందుతున్నాయని ఎమ్మెల్యే కొండయ్య అడిగారు. వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొండయ్య మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దార్శనికతతో అన్ని సమస్యలను అధిగమిస్తూ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. జగన్ పాలనలో అంతా అరాచకమేనని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 100 రోజుల్లోనే సీఎం చంద్రబాబు సారథ్యంలో మంచి ప్రభుత్వంగా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి సాగుకు నీరివ్వాలి

రైతు సంఘం డిమాండ్

బల్లికురవ. సెప్టెంబరు 20 : ప్రభుత్వం వరి సాగుకు నీటిని విడుదల చేయాలని బాపట్ల జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బల్లికురవ మండల కేంద్రంలో రైతు సంఘం నేతలు సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతు ఓపక్క డ్యాంలు పూర్తిగా నిండినా వరి సాగుకు నీటి విడుదల చేయకుండా ఆరు తడులు అంటున్నారని, దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉందని అన్నారు. అలానే ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలను వెంటనే అందించాలన్నారు. అలానే సున్నా వడ్డీ రాయితీలను జమ చేయాలన్నారు వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి ప్రకాష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేతలు నాగబోయిన సింగారావు, యిన్నమూరి రాజేశ్వరరావు, రామయ్య, పుచ్చకాయల వెంకట్రావు, బొట్టుగుంట కోటేశ్వరరావు, బొల్లినేని కోటేశ్వరరావు, దూళిపాళ్ల పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

రైతు సమస్యలు పరిష్కరించాలి

పంగులూరు : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పంగులూరులో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజారావుకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బాచిన హనుమంతరావు, వడ్డవల్లి కోటయ్య, రావూరి వెంకటేశ్వర్లు, శంకర్, పఠాన్ ఖాశీం, సునందబాబు, మల్లారెడ్డి, వెంకటరావు, తలపనేని సుబ్బారావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రైతులు, సంఘ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: అద్దంకిలోని కాకానిపాలెంలోని రంగనాయక స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సామూహిక లక్ష్మీ కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రకాశం, పల్నాడు, బాపట్లజిల్లాల కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కాకానిపాలెంలోని రంగనాయక స్వామి దేవాలయంలో ప్రతి రోజు ధార్మిక ఉపన్యాసాలు, భజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శుక్రవారం 100 మంది మహిళాభక్తులతో సామూహిక లక్ష్మీ కుంకుమపూజలు నిర్వహించినట్లు తెలిపారు. టీటీడీ నుంచి వచ్చిన పసుపు, కుంకుమ, లక్ష్మీ అమ్మవారి రూపులు, కంకనాలు, అక్షితలు పూజల్లో పాల్గొన్న వారికి, భక్తులకు అందించినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు భాగవతుల కొండమాచార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ, గోరంట్ల కోటేశ్వరమ్మ, మురకొండ విజయమ్మ, పాములపాటి నా రాయణమ్మ, గిరిజాల వరలక్ష్మి, మాదాల దా నయ్య, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి, హనుమంతరావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామూహిక లక్ష్మీ కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

గుండ్లకమ్మలో ఇసుక తవ్వకాల పరిశీలన

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- అక్రమ తరలింపుపై పటిష్ట చర్యలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: నిబంధనలు అతిక్రమించి ఇసుకను అక్రమంగా తరలించేవారిపై చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. శక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయిన 'ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు' కథనానికి స్పందించిన ఆర్‌డీవో అద్దంకి గుండ్లకమ్మ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఇసు క జల్లెడ పడుతున్న వారితోను, ట్రాక్టర్ డ్రైవర్లతోనూ మాట్లాడారు. అద్దంకి ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, నింబంధనలు పాటించకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే రాబోయే రోజులలో బ్రిడ్జి ప్రమాదం బారిన పడుతుందని అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో కాపలా ఏర్పాటు చేస్తున్నామని, అయినా రాత్రిళ్ల అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఇక్కడ పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు వాహనాలు పెట్టవద్దని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన వాహనాల లైసెన్సులను సీజ్ చేసే విధంగా రవాణాశాఖ అధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఆయన వెంట వీఆర్‌వో మందా రాంబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



గుండ్లకమ్మలో ఇసుక తొవ్వుతున్న వారితో మాట్లాడుతున్న చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

పరిశుభ్రతపై అవగాహన పెంచాలి

ఇంకొల్లు,సెప్టెంబరు 20 : స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు,కార్యదర్శి కోటినాగయ్య పాల్గొన్నారు. మండలంలోని ఇడుపులపాడులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు, పాఠశాల ఉపాధ్యాయసిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాలటౌన్, సెప్టెంబర్ 20 : రైలు ప్రమాదంలో గుర్తుతెలియని (40) వయసు కలిగిన వ్యక్తి మృతిచెందాడు. ఈసంఘటన వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అయితే మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్లు లేవు. వివరాలు తెలిసిన వారు స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చదువుతో పాటు ఆటలూ అవసరమే

చీరాల, సెప్టెంబరు 20 : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు అవసరమేనని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. మండలంలోని జాండ్రపేట హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మండలస్థాయి ఆటల పోటీలను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందుతున్నారు. అనంతరం వాలీబాల్ పోటీలకు సంబంధించి తొలి సర్వీస్ చేసిన క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొమ్మనబోయిన రజని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు

పర్చూరు, సెప్టెంబరు 20: 167ఏ జాతీయ రహదారికి సంబంధించి పర్చూరు రెవెన్యూ పరిధిలోని స్థానిక వైజంక్షన్ సమీపాన జరుగుతున్న పనులను రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. రహదారి నిర్మాణంలో కోల్పోయిన భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా పనులను ఎలా చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా రైతులకు నష్టపరిహారం ఇవ్వటం లేదని వాపోయారు. పర్చూరు సబ్ రిజిస్ట్రార్ వారి విలువ రూ.12లక్షల రూపాయలు ఉండగా రూ.6లక్షల ప్రకారం లెక్క కట్టి అవార్డు ఇచ్చారని రైతులు తెలిపారు. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో లేఅవుట్‌లో నష్టపోయిన బాధితులకు ఒక్కో సెంటుకు రూ.1.5లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చేవిధంగా అవార్డు ఇచ్చారన్నారు. అదే లేఅవుట్ పక్కనే ఉన్న భూములకు సెంటుకు రూ.18,000 మాత్రమే అవార్డు ఇచ్చారన్నారు. పూర్తి స్థాయిలో భూములను కోల్పోయిన తమకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తిమ్మరాజుపాలెం, బోడవాడ, పర్చూరు, నాగులపాలెం రైతులు, ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తి దారుల సహకార సంఘం మాజీ డైరెక్టర్ కుక్కపల్లి బుచ్చిబాబు, మాజీ జడ్పీటీసీ కొల్లా సుభాష్ బాబు, మల్లాది హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.



పర్చూరులో హైవే పనులను అడ్డుకొని నిరసన తెలుపుతున్న రైతులు

జాబ్ మేళాలో 24 మంది ఉద్యోగాలకు ఎంపిక

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: పెద్ద ఉద్యోగం అయినా చిన్న ఉద్యోగం తోనే ప్రారంభం అవుతుందని, ఉద్యోగం దూర ప్రాంతంలో వచ్చినా దానిని సద్వినియోగపర్చుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె సాహిల్‌బాబు అన్నారు. శుక్రవారం అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు కల్లం టెక్స్‌టైల్స్, కెఎల్ గ్రూప్, మాస్టర్ మైండ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 66 మంది అభ్యర్థులు హాజరు కాగా 24 మంది జాబ్‌లకు ఎంపిక అయ్యారు. మరో 15 మంది షార్ట్ లిస్టులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రిన్సిపాల్ చేతులమీదుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్, కళాశాల స్పోక్ పర్సన్ జి. రాజ్‌కుమార్, రవికిరణ్, కోఆర్డినేటర్ గోపి, శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపికైన వారికి నియమక పత్రాలు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు, తదితరులు

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 20 : విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు. రామన్నపేట బాలికల హాస్టల్లో శుక్రవారం విద్యార్థినులకు ఎస్సై వెంకటేశ్వర్లు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులు తమతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులకు, ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. ఆ వెంటనే పోలీస్ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. విద్యార్థినులు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వెంకయ్య మృతి టీడీపీకి తీరని లోటు

చినగంజాం,సెప్టెంబరు 20 : పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి పాత గొల్లపాలెంకు చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల బీసీ సెల్ మాజీ అధ్యక్షులు వడ్లమూడి వెంకయ్య(68) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంకయ్య స్వగృహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకయ్య మృతి చాలా బాధాకరమన్నారు.ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి,కుటుంబసభ్యులకు తీరని లోటన్నారు. వెంకయ్య కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మండల పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



వెంకయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఏలూరి

కాపు టీచర్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవరావు

పర్చూరు, సెప్టెంబరు 20: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పర్చూరు మండలం ఇనగల్లు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హరిదాసుల మాధవరావు నియమితులయ్యారు. విశాఖపట్నంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని శుక్రవారం మాధవరావు తెలిపారు.ఈ సందర్భంగా మాధవరావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అయిన ప్రజా కూటమి ప్రభుత్వం ఉద్యోగుల అభ్యున్నతికి తోడ్పాటు నందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చేపల చెరువులకు వేలం

మార్టూరు, సెప్టెంబరు 20: మండలంలోని నాగరాజుపల్లిగ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ పరిధిలోని మైనరు ఇరిగేషనుకు చెందిన రెండు చేపల చెరువుల వేలంను నిర్వహించినట్లు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. వాటిలో ఎర్రచెరువును గ్రామానికి చెందిన మిన్నెకంటి పోతురాజు 4.80 లక్షలకు పాటపాడారు.ఈ పాట రెండేళ్ల కాలపరిమితి వరకు ఉంటుంది.అదేవిధంగా రాజుపాలెం ట్యాంకు ఉన్న చెరువును గ్రామానికి చెందిన మిన్నెకంటి సాంబశివరావు 2.10 లక్షలకు పాడుకున్నారు.ఈ పాట కాలపరిమితి ఏడాది వరకు ఉంటుంది.

దోపిడీకి పాల్పడిన నలుగురు అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబర్ 20 : దారికాచి బంగారు నగలు దోపిడీకు పాల్పడిన నలుగురు నిందితులను ఈపూరుపాలెం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన వంగల వెంకట శాస్త్రి ఈనెల 10వ తేదీన ఈపూరుపాలెంలోని బంధువుల వద్దకు కుటుంబ సమేతంగా వచ్చాడు. ఇది గ్రహించిన నలుగురు వ్యక్తులు వెంబడించి నగలు ఉన్న బ్యాగును అపహరించారు. దీంతో బాధితులు ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి శుక్రవారం వారిని అరెస్ట్ చేశారు. అలాగే అపహరణ జరిగిన 38 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించారు. శనివారం వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

రోజువారీ కార్మికుల కాంట్రాక్ట్‌ను పొడిగించాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 20: అద్దంకి మున్సిపాలిటి పరిధిలో పని చేస్తున్న రోజువారి కార్మికుల కాంట్రాక్ట్ గడవు ఈ నెలాఖరుతో ముగుస్తుందని, దానిని మరో సంవత్సరం పాటు పొడింగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజువారి కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గాలి బీష్మా, పి. ఆదాం, ఇంజనీర్ వర్కర్స్ సామేలు, జాను తదితరులు పాల్గొన్నారు.